సమావేశము – II
వాల్యూము – IV
నెం. 2

వెల : రూ. 21-00
15 నవంబర్, 2014
శనివారము,
(శక సం. 1936,
కార్తీక – 24)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు | ... | 1 |
| 2. | సభా కార్యక్రమము : | ... | 21 |
| | వాయిదా తీర్మానం అనుమతి గురించి | | |
| 3. | ప్రత్యేక ప్రస్తావన | ... | 22 |
| 4. | ప్రభుత్వ తీర్మానము : | ... | 24 |
| | కేంద్ర ప్రభుత్వ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గురించి | | |
| 5. | సంతాప ప్రతిపాదన : | ... | 25 |
| | ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు మాజీ సభ్యులు శ్రీ బీరవెల్లి ధర్మారెడ్డి మృతి గురించి | | |


*****

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటీ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| ఉప కార్యదర్శులు | : | డా.వి. నరసింహాచార్యులు<br>శ్రీమతి టి. సుశీల |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్<br>శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి ఎ. చంద్రభాగ<br>శ్రీమతి వి. ఎన్. ప్రసన్న కుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు

## అధికార నివేదిక

## (రెండవ సమావేశము - ఎనిమిదవ రోజు)

## శనివారము, నవంబరు 15, 2014

(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

### నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు–వాగ్రూప సమాధానములు

### గిరిజన ప్రాంతాలకు రక్షిత మంచినీటి సరఫరా

ప్రశ్న నెం. 191 (27) శ్రీ సబావత్ రాములు నాయక్, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (గ్రామీణ నీటి సరఫరా, మురుగు నీటి పారుదల) శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ;

అ) రాష్ట్రంలో గిరిజన ప్రాంతాలకు రక్షిత త్రాగునీటి సరఫరా లేని విషయం వాస్తవమేనా ;

ఆ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (ఆర్‌డబ్ల్యుఎస్ – ఎస్) శాఖ మంత్రి గారు : (శ్రీ కె. తారకరామారావు)

అ) అవునండీ,

రాష్ట్రంలో గుర్తించిన మొత్తం ఎస్‌టి జనావాసాలు 7560, వాటిలో 4106 గ్రామాలకు పూర్తిగానూ, 3140 గ్రామాలకు పాక్షికంగానూ రక్షిత త్రాగునీటి సరఫరా కల్పించడమయింది. సురక్షితమైన త్రాగునీరు అందని జనావాసాలు 314.

ఆ) గిరిజన ప్రాంతాలతోపాటు, గ్రామీణ జనావాసాలు, పట్టణ ప్రాంతాలన్నింటికి రక్షిత త్రాగునీటిని సరఫరాచేసే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును ఇప్పటికే ప్రకటించింది.

శ్రీ సబావత్ రాములు నాయక్ : (నామినేటెడ్) అధ్యక్షా, మంచినీరు ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనది. ఆదిలాబాద్ జిల్లాలో జైనూర్ మరియు ఇతరం అనేక మండలాల్లో సీజన్ వచ్చినప్పుడు త్రాగునీరు దొరకక, కొత్తనీరు రావడంతోటి డయేరియా, మలేరియా వచ్చి ప్రజలు ఆనారోగ్యానికి గురవుతున్నారు. సమైక్య రాష్ట్రప్రభుత్వంలో అనేక సందర్భాల్లో గిరిజన సంఘాల నాయకులు గాని, ప్రజలు గాని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినప్పటికీ పట్టించుకోకుండా ప్రజల మరణాల తరువాత పట్టించుకునేవారు. మన ముఖ్యమంత్రివర్యులు త్రాగునీటి గురించి ప్రతి ఇంటికి మంచినీరు అందించాలనే ఉద్దేశ్యంతో గిరిజన ప్రాంతాలలో ప్రత్యేకంగా ఏమైనా వసతి కల్పిస్తున్నారా అని ప్రశ్నిస్తున్నాను. నారాయణ ఖేడ్ మండలాలలో 5, 6 కి.మీ. వరకూ నీటి కోసం నడచివెళ్ళే పరిస్థితి ఉన్నది. అక్కడ ఎండాకాలంలో దాదాపు నాలుగైదు రోజుల పాటు స్నానం కూడా చేయరు. కాబట్టి, ఎండాకాలంలో ఎక్కడైతే గిరిజన ప్రాంతాలలో నీళ్లు దొరకవో, అక్కడ నీటి వసతి కల్పిస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. కెసిఆర్ గారు కరీంనగర్ నుండి పార్లమెంట్‌కు పోటీ చేసినప్పుడు నేను ఎల్లారెడ్డి పేట ఇన్‌ఛార్జిగా ఉండేవాడిని అప్పుడు ఎల్లారెడ్డిపేట దగ్గర మండలాలు చాలా అభివృద్ధి చెందాయి. కానీ, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాలోని దేవరకొండ వంటి ప్రాంతాలలో ఫ్లోరైడ్ నీటి సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి, ఇటువంటి ప్రాంతాలకు మొదటగా ప్రాధాన్యతనిచ్చి అక్కడి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ మహమ్మద్ ఆలీ షబ్బీర్ : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, మీ ద్వారా మంత్రి గారిని రక్షిత మంచినీటి గురించి అడగాలని అనుకుంటున్నాను. నేను 2008లో మంత్రిగా ఉన్నప్పుడు పంచాయతీ రాజ్ శాఖలోనే ఉమ్మడి రాష్ట్రంలో రెండవ స్థానంలో, తెలంగాణాలో అతి పెద్ద ప్రాజెక్టు అయిన గోదావరి నుండి కామారెడ్డికి మంచినీటి సరఫరా చేసే ప్రాజెక్టుగా కామారెడ్డి ప్రాజెక్టు ఉన్నది. మునిసిపల్ మరియు పంచాయతీ రాజ్ రెండు శాఖలు కలిపి చేసే

ప్రాజెక్టు అది. సాధారణంగా ఈ రెండు డిపార్ట్మెంట్లు కలవవు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నిధులు సుమారు రూ.150 కోట్లు పూర్తిగా ఇవ్వడం జరిగింది. నీళ్లు కూడా కామారెడ్డి వరకూ వచ్చాయి. సుమారు 95 కి.మీ.ల పరిధిలో మూడు సార్లు పంపింగ్ చేయాలి. జలాల్పూర్ గోదావరి, అరుగుల్ నుండి పంపింగ్ చేసి ఇందల్వాయి నుండి పంపింగ్ చేస్తే మల్లన్న గుట్ట నుండి గ్రావిటీతో 211గ్రామాలకు వస్తుంది. మున్సిపాలిటీ వారు రూ.47కోట్లు ఇచ్చేశారు. వాళ్ల పని అయిపోయింది. కామారెడ్డికి త్రాగునీరు వచ్చి సుమారు 8 నెలలు అయిపోయింది. కానీ, గ్రామాలకు వెళ్లేటప్పుడు పంచాయతీలకు మాత్రం నీళ్లు వెళ్లడం లేదు. ఎందుకంటే అక్కడ నుండి రూ.70కోట్లు కావాలంటే రూ.20కోట్లు రిలీజ్ అయింది. ఆ పనులు కూడా పూర్తికావచ్చాయి. దాంట్లో ముఖ్యంగా 29 తాండాలు ఉన్నాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి ఇన్క్లూడ్ చేస్తామన్నారు. దాంతో సుమారు 89 తాండాలు కవర్ అవుతాయి. ట్రైబల్, పంచాయతీ, మున్సిపల్ ప్రాంతాలు కూడా కవర్ అవుతున్నాయి. ఇంత మంచి ప్రాజెక్టు ఇది. కాబట్టి, దీనిపై సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి, సమస్యలుంటే సాల్వ్ చేసి రూ.50కోట్లు రిలీజ్ చేసి, పైపులు వేసుకుంటూ, ఓవర్ హెడ్ ట్యాంకులను కలుపుకుంటూపోతే వేసవి కాలంలోపల మంచినీళ్లు వస్తాయి. ఇది నాలుగైదు నెలల పని. దానివల్ల 211 గ్రామాలకు 59 తాండాలకు నీళ్లు ఇచ్చినవాళ్లు అవుతారు. ఈ స్కీము పూర్తవుతుంది. తెలంగాణా బిడ్డలు సంతోషిస్తారు. సోమవారం పేట, రెడ్డిపేట, అన్నారం, మద్దికుంట వంటి అనేక తాండాలకు, మారుమూల ప్రాంతాలకు కూడా నీళ్లు వస్తాయి. దీనిని పరిశీలించి హామీ ఇవ్వాలని కోరుతున్నాను.

శ్రీ అరికెల నర్సారెడ్డి : (స్థానిక సంస్థలు) నిజామాబాదులోని ఫ్లోరైడ్ ప్రాంతాల్లో ఆర్డబ్లుఎస్ క్రింద దాదాపు 10 స్కీములున్నాయి. డిచ్పల్లి, రాముడుగు, బాల్కొండ, బాన్సువాడ, కామారెడ్డి వంటి ప్రాజెక్టులు ఉన్నాయి. నిజామాబాదులో ఎమ్చా, రాముడుగు, డిచ్పల్లి, దోమకొండ ప్రాజెక్టులకు మొదటి దశ పూర్తయింది, రెండవ దశ కూడా ఆల్మోస్ట్ పూర్తికావస్తున్నది. వాటికి నాలుగైదు కోట్లు ఖర్చుపెడితే ప్రతి గ్రామానికి నీళ్లు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం వాటర్ గ్రిడ్ స్కీమును తీసుకువస్తున్నది. ఎంత త్వరగా పూర్తి చేసినా నాలుగైదు సంవత్సరాలు పడుతుంది. కాబట్టి, ఒక నెల రోజులు సీరియస్గా వీటిపై ఖర్చు పెడితే ఈ మూడు ప్రాజెక్టులు పూర్తవుతాయి. ఈ మూడు మండల గ్రామాలలో ఎస్టీ తాండాలు ఉన్నాయి. పైప్లైన్ వేశారు, వాటర్ కనెక్షన్ కూడా పూర్తయింది. చిన్న చిన్న లింక్లతో పని ఆగిపోయింది. కాబట్టి, తక్షణమే ఈ మూడు ప్రాజెక్టులను పూర్తిచేయాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ బలసాని లక్ష్మీనారాయణ : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, వర్షాకాలం మొదలైన తరువాత గిరిజన ప్రాంతాలలో మలేరియా, డయేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు వస్తాయి. నేను మంత్రిగారిని కోరేదేమంటే ప్రభుత్వం ప్రత్యేకంగా వాటర్ గ్రిడ్లను ఏర్పాటు చేసే కార్యక్రమం చేపట్టింది కాబట్టి, ప్రధానంగా రాబోయే సంవత్సరాలలో జూన్, జులై మాసాలలోపు గిరిజన ప్రాంతాలలో మొదలుపెట్టమని నేను మంత్రిగారిని కోరుతున్నాను. ఏ, ఏ ప్రాంతాలలో ఈ వ్యాధులు ప్రబలుతున్నాయో ప్రభుత్వం దగ్గర రికార్డు ఉంటుంది. ఈ వ్యాధులకు ప్రధాన కారణం మంచినీరు. ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టినా క్షేత్రస్థాయిలో ఎ.ఇ.లు, పంప్ మెకానిక్లు లేకపోతే ఇబ్బందవుతున్నది. కాబట్టి, ఔట్సోర్సింగ్లోనైనా సరే ప్రతి మండలానికి ఒకరు, లేదా ఇద్దరు ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు : (శాసనసభ నియోజక వర్గం) జనగామ నియోజకవర్గం నర్మెట్ట మండలంలో కాంప్రహెన్సివ్ రూరల్ వాటర్ సప్లై స్కీము మంజూరైంది. కానీ, పనులు నత్త నడక నడుస్తున్నాయి. కారణాలు తెలియరావడం లేదు. నిధులు లేకనా లేదా ప్రాపర్గా సిబ్బంది లేకనా అనేది తెలియడం లేదు. కాంట్రాక్టరు కూడా సరిగా పనిచేయడం లేదు. తక్షణమే దానిపై గౌరవ మంత్రివర్యులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ పట్నం నరేంద్రరెడ్డి : (స్థానిక సంస్థలు) అధ్యక్షా, ముందుగా 500మంది జనాభా దాటిన తాండాలను పంచాయతీలుగా మార్చేందుకు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రిగారికి, పంచాయతీరాజ్ శాఖా మంత్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. రంగారెడ్డి జిల్లాలో కలెక్టరు గారి లెక్కల ప్రకారం 290 తాండాలు ఉన్నాయి. పరిగి నియోజకవర్గంలోనే 220 తాండాలు ఉన్నాయి. ఇంకా గుర్తించని తాండాలు 390పైన ఉన్నాయి. వాటిని కూడా గుర్తించి ఆయా తాండాలకు కూడా రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పాతూరి సుధాకర రెడ్డి : (మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్) రాములు నాయక్ గారు మంచి ప్రశ్న వేశారు. గ్రామీణ ప్రాంతాలలో లంబాడీలు నికృష్టమైన జీవనం

గడుపుతూ, ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యేకంగా కరీంనగర్ జిల్లా, కోహెడ మండలంలో బస్వాపూర్ గ్రామంలో సుమారు 4 లంబాడా తాండాలు ఉన్నాయి. దాని పక్కనే సిద్ధిపేట నియోజకవర్గం బద్దిపడిగె గ్రామం ఉన్నది. ఆ గ్రామానికి మంచినీటి సౌకర్యం ఉన్నది. కానీ, దానికి ఆనుకుని ఉన్న లంబాడా తాండాకు మాత్రం ఇంతవరకూ మంచినీటి సౌకర్యం లేకపోవడం వల్ల లంబాడీలందరూ కూడా కిలోమీటరు నుండి నీళ్లు తీసుకుపోయే పరిస్థితి వస్తున్నది. కాబట్టి, అందుకొరకు బస్వాపూర్ రెవెన్యూ పరిధిలో సుమారు మూడు లంబాడా తాండాలు ఉన్నాయి. వారు కూడా వారియొక్క తాండాలన్నీ కలిపి ఒక గ్రామ పంచాయతీగా చేయడానికి అవకాశముంటుందా అని అడిగారు. రెండవది – ఆ మూడు తాండాలకు కూడా మంచినీటి సౌకర్యం కొరకు ప్రత్యేకమైన సౌకర్యం ఏర్పాటు చేస్తారా? లేక వాటర్ గ్రిడ్ ద్వారానే నీళ్లు వస్తాయా? మంత్రిగారు దీనిపై స్పష్టతనివ్వాలని కోరుతున్నాను.

శ్రీ కె. తారక రామారావు: (సిరిసిల్ల) అధ్యక్షా, రాష్ట్ర ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమానికి సంబంధించి ఒక సవివరమైన అవగాహన గౌరవ సభ్యులకు, ప్రజలకు ఉండవలసిన అవసరమున్నది. గౌరవ ముఖ్యమంత్రిగారు 1996–97 ప్రాంతాలలో అప్పటి సిద్ధిపేట శాసనసభ్యుడుగా, మంత్రివర్యులుగా వారు ప్రతి ఇంటికి లోయర్ మానేరు డ్యాం నుండి 65 కి.మీ. పరిధిలో దాదాపు 180 జనావాసాలను కవర్ చేస్తూ, దాదాపు 18 సంవత్సరాల క్రితమే ఇంటింటికి మంచినీటిని అందించడం జరిగింది. అదే కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ రోజు మేము రాష్ట్రవ్యాప్తంగా రాబోయే నాలుగు సంవత్సరాల లోపల ఇంటింటికి మంచినీళ్లు అందించాలనే లక్ష్యంతో పూర్తి నిబద్ధతతో ప్రభుత్వం ముందుకు వెడుతున్నది.

రాష్ట్రంలో హైదరాబాదును మినహాయించి మిగిలిన 9 జిల్లాలలో దాదాపు 25వేల హాబిటేషన్లు ఉన్నాయి. ఇందులో గ్రామ పంచాయతీలు, తాండాలు, హామ్లెట్స్, గిరిజన గూడెంలు ఉన్నాయి. అందులో ఫ్లోరోసిస్‌తో సతమతమవుతున్న నల్గొండ జిల్లాలు ఉన్నాయి. ఫ్లోరైడ్ మహమ్మారి ఇతర జిల్లాలలకు కూడా విస్తరించే పరిస్థితి కనబడుతున్నది. కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత అవసరాలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే కాకుండా 2050వ సంవత్సరం వరకూ నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది. ప్రతి గ్రామీణ పౌరుడికి 100ఎల్‌పిసిడి, అంటే వంద లీటర్ల నీటిని ప్రతిరోజు ఇవ్వాలనే లక్ష్యంగా పెట్టుకున్నాము. మనకు ఆరోగ్య సంస్థలు బెంచ్‌మార్క్ ఇచ్చే విధంగా గ్రామీణ పౌరులకు 100ఎల్‌పిసిడి, పట్టణ పౌరులకు 150ఎల్‌పిసిడి చొప్పున వాటర్ గ్రిడ్ పథకం ద్వారా ఇవ్వాలని అనుకున్నాము.

చాలామంది సభ్యులు on going projects గురించి ప్రస్తావించారు. కామారెడ్డి, రామడుగు, డిచ్‌పల్లి, జనగాం, హుస్నాబాద్ వంటి స్కీముల గురించి గౌరవ సభ్యులు ఇంతకు ముందు చెప్పారు. On going Schemes పట్ల కూడా మాకు స్పష్టత ఉన్నది. గత ప్రభుత్వాలు తీసుకున్న స్కీములు మంచివే అయినా, కొన్ని చోట్ల 40, 60, 70 ఎల్‌పిసిడిలు మాత్రమే ఉన్నాయి. అల్టిమేట్‌గా లోకల్ సోర్సెస్ అయిన గ్రౌండ్‌వాటర్, బోర్‌వెల్స్ ద్వారా వాడుకుంటుండవచ్చు, దగ్గరలో ఉన్న చెరువుల నుండి సర్ఫేస్ వాటర్ ద్వారా నీటిని తీసుకోవచ్చు. ఇందులో మేము తీసుకున్న విధానపరమైన నిర్ణయం ఏమంటే, ప్రతి గ్రామీణ పౌరునికి 100 ఎల్‌పిసిడి సర్ఫేస్ వాటర్ ఇవ్వాలి. ఉదాహరణకు, కామారెడ్డి లో గానీ, జనగాంలో గానీ, ఏదైనా లోకల్ సోర్సు నుండి అంటే బోర్‌వాటర్ ద్వారా 70 ఎల్‌పిసిడి ఇస్తున్నట్లయితే, అక్కడ పూర్తిగా 100 ఎల్‌పిసిడి సర్ఫేస్ వాటర్ ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. సర్ఫేస్ వాటర్ చాలా ముఖ్యమైనది. ఎందుకంటే భూమి ఉపరితలం మీద ఉండే ఆరోగ్యానికి హానికారకమైన మినరల్స్ ద్వారా ఫ్లోరోసిస్ వంటి వ్యాధులు వస్తాయి. కాబట్టి, గ్రౌండ్ వాటర్‌ని మిక్స్ చేస్తే, పూర్తి స్థాయిలో వాటిని అరికట్టే పరిస్థితి ఉండదు. అందుకని పూర్తి స్థాయిలో సర్ఫేస్ వాటర్ ఇవ్వాలని 100ఎల్‌పిసిడి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ముందుకు పోతున్నాము. రాబోవు నాలుగు సంవత్సరాలలోపు వాటర్ గ్రిడ్ కార్యక్రమాన్ని పూర్తిచేయాలనే గట్టి కమిట్‌మెంట్‌తో ప్రభుత్వం ఉన్నది. సభ్యులు ప్రస్తావించినట్లు ఫ్లోరోసిస్ సమస్య పట్ల నల్గొండ జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయి. అప్పుడు మా పార్టీ అధ్యక్షులుగా ముఖ్యమంత్రిగారు పూర్తి స్థాయిలో నల్గొండ జిల్లాలో దాదాపు 37 మండలాలను వారం, పది రోజుల పాటు పర్యటించారు. ఈ ఫ్లోరోసిస్ శాశ్వత పరిష్కారానికి గౌరవ ముఖ్యమంత్రి గారు వాటర్ గ్రిడ్ కార్యక్రమానికి నల్గొండ జిల్లాలోనే శంకుస్థాపన చేయాలని నిర్ణయించుకున్నారు. ఫ్లోరోసిస్‌ను శాశ్వతంగా మన రాష్ట్రం నుండి తరిమివేయుటకు ఈ ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని నేను గౌరవ సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

**10.20 ఉ.**

వాటర్ గ్రిడ్ ప్రారంభోత్సవం రాబోయే సంవత్సరం 2015 తొలి మాసంలో గానీ, లేదా ఫిబ్రవరి రెండవ వారంలోగానీ చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నది. ఈ స్కీము యొక్క స్కోప్ కూడా సభ్యులకు అర్థం కావాలి. హైదరాబాదు చుట్టూ ఔటర్ రింగ్‌రోడ్డు ఉన్నది. ఈ ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల ఉన్న 9 జిల్లాలలోని ప్రతి జనావాసాన్ని కవర్ చేస్తూ, పూర్తి స్థాయిలో ఇంటింటికీ నల్లా కలెక్షన్ ఇవ్వాలనే ఒక బృహత్తర లక్ష్యం పెట్టుకున్నాము. మున్సిపాలిటీలకు ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ నుండి ఆయా టౌన్లకు నేరుగా

నీరు బల్క్ సప్లై చేస్తాము. నీటి శుద్ధి, మున్సిపాలిటీ లోపల ఉండే డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ అనేది పబ్లిక్ హెల్త్ అండ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌వారు చేస్తారు. ఈ విధంగా వాటర్ సోర్సు ఆధారంగా 9 జిల్లాలలో 26 సబ్ గ్రిడ్‌లుగా, విభజించుకున్నాము. జనగాం, కామారెడ్డి, హుస్నాబాద్ ఇతర పట్టణాలను ఉదాహరణగా తీసుకుంటే స్థానికంగా ఉండే సోర్సును బట్టి వాటర్ గ్రిడ్‌ను ఫైనలైజ్ చేయడం జరిగింది. లోయర్ మానేరు డ్యాం సోర్సుగా చుట్టుపక్కల ఉండే పలు నియోజకవర్గాలను కవర్ చేయబోతున్నాము. దానిని ఒక గ్రిడ్‌గా గుర్తించాము. ఆ రకంగా గుర్తించిన 26 గ్రిడ్‌లకు సంబంధించి లైన్ ఎస్టిమేషన్ ప్రిపేర్ అయింది. డిటైల్డ్ ఎస్టిమేషన్ రాబోయే నెలాఖరుకల్లా తయారవుతుంది. జనవరి చివరికల్లా మొదటి ఆరు గ్రిడ్‌లకు మేము టెండర్లు పిలవాలనే ఆలోచనతో ఉన్నాము. ఫిబ్రవరిలో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టాలనే ఆలోచనతో ఉన్నాము. On going Schemes ను అప్‌గ్రేడ్ చేయాలనే ఆలోచనతో ఉన్నాము. On going Schemesలో కేవలం 70 జూఇధిఫీ ప్రతిపాదిత సామర్థ్యం ఉన్నది. దానిని పెంచి 100 lpcdలుగా చేయాలని నిర్ణయం తీసుకున్నాము. ఎందుకంటే 100 lpcd ఇవ్వడమనేది మా కమిట్‌మెంట్. ఇంత పెద్ద గ్రిడ్‌ను ఆపరేట్ చేయాలంటే స్థానికంగా పంప్ ఆపరేటర్ లేక, అసిస్టెంట్ ఇంజనీర్ లేకపోతే ఎలా అవుతుంది అని సభ్యులు శ్రీ బాలసాని లక్ష్మీనారాయణగారు అడిగారు. ఈ విషయాన్ని మేము ఇప్పటికే గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువచ్చాము. మా డిపార్ట్‌మెంట్ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు సంబంధించి పంప్ మెకానిక్‌లు, ఆపరేటర్లు, ఏ.ఈ.లు, డి.ఈలు, ఎస్.ఈ, సి.ఈలు అందరినీ కలుపుకుంటే మొత్తం 1200 మంది కొత్త సిబ్బందిని నియమించుకోవడానికి మాకు అనుమతిచ్చారని మేము సగర్వంగా తెలియచేస్తున్నాము. క్షేత్ర స్థాయిలో వీరే పనిచేయాల్సి ఉంటుంది, on going maintenance కూడా వారే చేయాల్సి ఉంటుంది కాబట్టి ఇవన్నీ ఏర్పాటు చేసుకుని మేము ముందుకు వెడుతున్నాము.

తండాలకు సంబంధించి ప్రత్యేకంగా చెప్పాలి. ముఖ్యంగా ఆడబిడ్డలు మంచినీళ్లకోసం కిలోమీటర్ల దూరం నడిచిపోయే పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఇంటింటికి నల్లా ద్వారా మంచినీళ్లు సరఫరా చేయాలనే మంచి సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెడుతున్నది. ప్రస్తుతం సురక్షితమైన మంచినీరు అందని 314 గిరిజన జనావాసాలను top priority గా తీసుకుని వాటిని త్వరలోనే రిక్టిఫై చేస్తామని మనవి చేస్తున్నాను. హుస్నాబాద్ గురించి ప్రత్యేకంగా సభ్యులు అడిగారు. దీనికి లోయర్ మానేరు గ్రిడ్ ద్వారా అనుసంధానం చేస్తూ, అక్కడ ఉన్న తాండాలను కవర్ చేస్తాము. షబ్బీర్ ఆలీ గారు అడిగిన విధంగా కామారెడ్డి స్కీమును top priority గా తీసుకుని వీలైతే మొదటి దశలోనే కవర్ చేస్తాము. దానిని 70 lpcd నుండి 100 lpcdకి అప్‌గ్రేడ్ చేస్తామనిమనవిచేస్తున్నాను.

## రాష్ట్రంలో గుర్తింపులేని పాఠశాలలు

ప్రశ్న నెం. 125(8)

సర్వశ్రీ ఎ. నర్సారెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, వి.గంగాధర్ గౌడ్, ఎం.ఎల్.సిలు.

గౌరవనీయులైన విద్యాశాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :

(అ) రాష్ట్రంలో గుర్తింపు లేని పాఠశాలలను నిర్వహిస్తున్నారన్న విషయం వాస్తవమేనా :

(ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి? అందుకు సంబంధించి తీసుకున్న చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన విద్యాశాఖా మంత్రి (జి. జగదీష్ రెడ్డి)

(అ) అవునండీ.

(ఆ) గుర్తింపు పొందని పాఠశాలలకు షోకాజు నోటీసులు ఇస్తూ జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవడం జరిగింది.

శ్రీ జి. జగదీష్ రెడ్డి : (సూర్యాపేట) ఇప్పటివరకూ 306 పాఠశాలలు ఈ విధంగా గుర్తింపు లేకుండా నడుస్తున్నట్లు మా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అందుకు నోటీసులను ఇవ్వడం జరిగింది. నోటీసులు అందగానే వాళ్లు స్పందించి అప్లికేషన్లు, సంబంధిత పత్రాలను సమర్పించిన తరువాత పరిశీలించి ఈ సంవత్సరం ఇప్పటివరకూ 152 పాఠశాలలకు గుర్తింపునివ్వడం జరిగింది. ఇంకా 154 పాఠశాలల వారు కొంత సమయం తీసుకున్నారు. ప్రభుత్వం సూచించిన సౌకర్యాలను పూర్తి చేస్తామని, గుర్తింపు నివ్వాలని వారు అప్లికేషన్లు పెట్టుకున్నారు. గుర్తింపు ఉన్నవాటినే నడిపించాలనే ఉద్దేశ్యంతో సంబంధింత డి.ఈ.వోలు చర్యలు తీసుకుంటున్నారు.

శ్రీ అరికెల నర్సారెడ్డి : (స్థానికసంస్థలు) అధ్యక్షా, మా గ్రామంలో ఒక పాఠశాలలో 10, 12 మంది ఉపాధ్యాయులుంటారు, 10 రూములుంటాయి. అంటే ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మౌలిక సదుపాయాలున్నాయి. క్వాలిఫైడ్ ఉపాధ్యాయులున్నారు. ఒక్కొక్క గ్రామంలోని పాఠశాలలకు ప్రభుత్వం కనీసం నెలకు రూ.3 లక్షలు ఖర్చుపెడుతున్నది. అంత ఖర్చు పెడుతున్నా కనీసం 500,600 మంది కూడా అక్కడ చదవడం లేదు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలలో సరైన అవగాహన లేక నామోషీగా ఫీలై అక్కడ చదివించడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తూ, నా బిడ్డ కాన్వెంట్‌లో చదువుతున్నాడని

గొప్పగా చెప్పుకునే పరిస్థితులు వచ్చేశాయి. కాబట్టి ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రభుత్వం ఒక్కొక్క గ్రామానికి ఒక్కొక్క విద్యార్థికి వెయ్యి నుండి రెండువేల రూపాయలను ఖర్చు చేస్తున్నాము. కానీ, పేదవాడు దానిని ఉపయోగించుకునే పరిస్థితి ఉండడం లేదు. ప్రైవేటు పాఠశాలలో రెండు బెంచిలు, రెండు గదులపైన రేకులు ఉన్నా, బట్టలు మాత్రం టై, యూనిఫారమ్ వేసే సరికి కాన్వెంటుకు బస్సులో పెడుతున్నారనే భావం ప్రజలకు కలుగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలున్నా చదువుకునే పరిస్థితి లేదు, ప్రైవేటు పాఠశాలల్లో ఎటువంటి వసతులు లేకపోయినా ప్రజలకు ఉన్న మోజు కొద్దీ పిల్లలను చదివిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలపై నిఘా పెట్టి, హైస్కూలు అంటే కనీసం 10 లేదా 15 ఎకరాల స్థలం, గార్డెన్, గ్రౌండ్, క్లాసు రూములలో బెంచెస్, అర్హత గల ఉపాధ్యాయులు ఉండాలి అనే నిబంధనలు గట్టిగా పాటించే విధంగా ఉండాలి. పదవ తరగతి, ఇంటర్ తప్పిన వాళ్లు ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. స్టాండర్డ్ మెయింటెన్ చేస్తే, నాణ్యమైన విద్య పిల్లలకు అందించగలుగుతాము. పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తే తప్ప పాఠశాలలకు పర్మిషన్లు ఇవ్వము అని ప్రభుత్వం గట్టిగా ఉంటే తప్ప కంట్రోల్ కాదు. ఈ విధంగా అయితే, ప్రభుత్వ పాఠశాలలు బాగుపడతాయి, ప్రైవేటు పాఠశాలల స్టాండర్డ్స్ కూడా పెరుగుతాయి. అందుకు తగిన చర్యలు చేపడతారని నేను ఆశిస్తున్నాను.

శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ః (శాసనసభ నియోజకవర్గం) అధ్యక్షా, మా నిజామాబాదుతో సహా చాలా గ్రామాలలోని పాఠశాలల్లో ఈ విధమైన గుర్తింపు లేని పాఠశాలలు నడుస్తున్న మాట వాస్తవం. నిజామాబాదు టౌన్‌లో కూడా 6,000 నుంచి 7,000ల మంది విద్యార్థులు ఉన్నచోట కూడా క్రీడా మైదానాలు, ఇతర సదుపాయాలు లేకుండా నడుస్తున్న పాఠశాలలు ఉన్నాయి. మేము ఎన్నోసార్లు సంబంధిత డి.ఈ.వో ఇతర అధికారులకు చెప్పినప్పటికీ నిబంధనలు పాటించకుండా పాఠశాలలు ఉండడం వాస్తవమా కాదా అని నేను తమ ద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను. నిబంధనలను తుంగలో తొక్కి ఈ విధంగా పాఠశాలలు నడుస్తున్న తీరు బాధాకరం. మాసాయిపేటలో ఎంత మంది పిల్లలు చనిపోయారో ఆ సంఘటన మనందరికీ తెలిసినదే. ఏ మాత్రం కండిషన్‌లో లేని బస్సులను ప్రైవేటు పాఠశాలల వారు నడుపుతున్నారు. కాబట్టి రాబోయే రోజులలో గట్టి నిబంధనలు పెట్టి ఒక పాఠశాలకు పర్మిషన్ ఇచ్చేటప్పుడే నిబంధనల ప్రకారం ఉన్నదా లేదా అని పరిశీలిస్తే బాగుంటుందని మీ ద్వారా మంత్రిగారిని నేను కోరుతున్నాను. దీనిపై రాబోయే రోజులలో ఒక మంచి చట్టం తీసుకువచ్చి విద్యావిధానాన్ని మెరుగుపరచాలని, ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించనట్లైతే మొదటే వారికి పర్మిషన్లు నిరాకరిస్తే సగం సమస్యలు తగ్గుతాయి. ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని నేను మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ బలసాని లక్ష్మీనారాయణః (శాసనసభ నియోజక వర్గం) మంత్రిగారు షోకాజ్ నోటీసులు ఇచ్చామని సమాధానమిచ్చారు. అది నిరంతర ప్రక్రియగా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక స్క్వాడ్‌ను పెట్టి, క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారా లేదా అని చెక్ చేయాలి. మిగతా వసతులు కూడా నిబంధనల ప్రకారం ఉన్నాయా లేవా అని చూడాల్సిన అవసరం ఉన్నది. విద్య కోసం ఖర్చు పెట్టేది ఇన్వెస్ట్‌మెంట్ అని ప్రభుత్వం తెలియచేస్తున్నది కాబట్టి ఇందుకు ప్రత్యేకమైన టీమ్‌ని ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీ చేయాలని, ఈ ప్రతిపాదన ప్రభుత్వం దగ్గర ఉన్నదా లేదా అనే విషయాన్ని మంత్రిగారు తెలియచేయాలని కోరుతున్నాను.

శ్రీ కర్నె ప్రభాకర్ ః (నామినేటెడ్) అధ్యక్షా, సమైక్య రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్థమైంది. కొత్త రాష్ట్రంలో తప్పకుండా విద్యావ్యవస్థను మార్చుకోవాలనే సదుద్దేశ్యం, మంచి ఆలోచన ఈ ప్రభుత్వానికి ఉండడమనే దానికి ముందుగా మంత్రిగారికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. స్థానికంగా ఉండే పాఠశాలల గురించి అనేకసార్లు అక్కడ ఉండే డి.ఈ.వోలకు ఫిర్యాదు చేసినప్పటికీ ఆ నిముషానికి వాటిని స్వీకరించి, తరువాత చెత్తబుట్టలో పడేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. జిల్లాలలోనే కాదు, హైదరాబాదులో వీధికొక అనుమతి లేని పాఠశాలలో మినిమమ్ వసతులు లేకుండా, చిన్న చిన్న రూములలో దాదాపు 20మంది పట్టే రూములలో 40, 50 మంది విద్యార్థులను కూర్చోబెట్టి పాఠశాలలను నడుపుతూ, ఏదైనా ప్రమాదం జరిగితే ఆ నిముషానికే చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంటున్నారు తప్ప పకడ్బందీ చర్యలు తీసుకోవడం లేదు. ఈ అంశాలు సభ జరుగుతున్నప్పుడు చర్చకు వస్తున్నాయి, ఆ తరువాత మర్చిపోతున్నారు. విద్యావ్యవస్థని సంస్కరించాలంటే, వాటిపైన చర్యలు తీసుకోవాలంటే ఒక ప్రత్యేకమైన టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేసి ఖచ్చితమైన చర్యలు తీసుకోకపోతే చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. పాఠశాలల్లోని విద్యార్థులను సరైన విధంగా తీర్చిదిద్దకపోతే దేశానికే నష్టం. విద్యావ్యవస్థ మార్పుల పట్ల ఈ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మరింత పటిష్టపరచి తప్పకుండా అర్హత లేని అనుమతులు లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవలసిందిగా తమ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పూల రవీందర్ : (వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ) అధ్యక్షా, ఈ ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణకోసం ప్రయత్నం చేస్తున్నది సంతోషం. అయితే, గ్రామ స్థాయిలో పాఠశాలలు ఉన్నాయి, అకామడేషన్, క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారు. కాబట్టి ఏ మాత్రం పాలసీలో మార్పులు తీసుకువచ్చి గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రైవేటు పాఠశాలలను తగ్గించాలి. రేషనలైజేషన్ ప్రణాళికలు తయారైనాయి, వేసవిలో చేయడానికి మంత్రిగారు సిద్ధంగా ఉన్నారు కాబట్టి అందులో మన ప్రభుత్వ పాఠశాలలను తీసివేయడం కాకుండా ప్రైవేటు పాఠశాలలను ముందుగా తీసివేయాలి. ప్రభుత్వ పాఠశాలలు ఎన్నో సంవత్సరాల నుండి ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలలు ఈ మధ్యనే వచ్చాయి.

కార్పొరేట్ విద్యా రంగం చాలా ప్రమాదకరంగా తయారవుతున్నది. పిల్లల నుండి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. నారాయణ, చైతన్య వంటి కళాశాలలు అపార్ట్‌మెంట్స్‌లో ఏ మాత్రం నిబంధనలు పాటించకుండా, వాటిని తుంగలో తొక్కి, పిల్లలను జైళ్లలో పెట్టి చదివించినట్లు పాఠాలను బట్టీ కొట్టించి చదివిస్తున్నారు. దీనిమీద సరైన చర్యలు తీసుకోవాలని మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి : (మహబూబ్ నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్) అధ్యక్షా, ఈనాడు ప్రైవేటు పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ అయిన ఎల్.కె.జి., యు.కె.జి.లకు మనం అనుమతిస్తున్నామా? ఇవ్వకపోతే, వాళ్లు ఏ విధంగా ప్రకటనలు చేస్తున్నారనేది మంత్రిగారు తెలియచేయాలని కోరుతున్నాను. మన వ్యవస్థలో గుర్తింపు లేని పాఠశాలలు, ఒక పేరు మీద గుర్తింపు తీసుకుని వేరే పేరు పెట్టి నడుస్తున్న పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. చాలా కార్పొరేట్ కళాశాలలు వేరే పేరు మీద అనుమతి ఉన్నవాటిని కొనుగోలు చేసి, వీళ్ల పేరుతో బోర్డు పెట్టుకుంటున్నారు. ఇటువంటి దాఖలాలు ఎన్నో ఉన్నాయి. ఈ ప్రశ్నతో సంబంధం లేకపోయినా తమ ద్వారా మంత్రిగారికి ఒక సూచన చేయాలని అనుకుంటున్నాను. పదవ తరగతిలో మార్కులు ఎక్కువ వచ్చాయని ఇంటర్ మొదటి సంవత్సరంలో తక్కువ ఫీజు తీసుకుని మోసపూరితంగా అడ్మిషన్ ఇస్తున్నారు. సెకండ్ ఇయర్‌కు వచ్చేసరికి తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టే విధంగా మీ అబ్బాయి మొదటి సంవత్సరంలో మార్కులు తెచ్చుకోలేదు గనుక రెండవ సంవత్సరంలో ఫీజు కన్సెషన్ ఇవ్వడం లేదు అని మొత్తం చెల్లించే విధంగా తల్లిదండ్రుల మీద ఒత్తిడి తీసుకువస్తున్నారు. కాబట్టి విద్యార్థి వెనకబడి ఉండడానికి అసలు కారణమేమిటో ఆలోచించాలి గానీ, ఈ విధంగా చేసే సంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది. చాలా కార్పొరేట్ విద్యాసంస్థలు ఈ విధంగా తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయి. వీటి మీద కూడా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

10.40 ఉ. శ్రీ ఫారుక్ హుస్సేన్ : (నామినేటెడ్) అధ్యక్షా, కరీంనగర్‌లో శ్రీనిధి మహిళా కళాశాలలోని ల్యాబ్‌లో గ్యాస్ లీక్ అయి మహిళలు, పిల్లలు దాదాపు 50 మంది మా చెల్లెళ్లు, బిడ్డలు ఆసుపత్రి పాలయ్యారు. ఈ సంఘటనను ఇప్పుడే టీ.వీలో చూశాను. వారికి ప్రభుత్వం తరఫున ట్రీట్‌మెంట్ జరుగుతోందా, ఆ కాలేజీ మీద ఏమైనా చర్య తీసుకుంటారా అని మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

రెండవది ఏమిటంటే. రిక్షా తోలే వారి కొడుకు కలెక్టర్ గారి కొడుకు ఒకే పాఠశాలలో చదవాలనేది తన ఆశయమని గౌరవ ముఖ్యమంత్రి గారు చాలా సందర్భాలలో చెప్పారు. కానీ ఈ రోజు ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలను చూస్తే ప్రజల దగ్గర డబ్బును అన్యాయంగా దోచుకుంటున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం నిఘా పెట్టి విద్యార్థులకు నాణ్యమైన చదువును చెప్పిస్తూ, బీదవారి పిల్లల్ని ధనవంతుల పిల్లల్ని ఒకేవిధంగా చూస్తే ఈ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని భావిస్తున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, మొదటి ప్రశ్నకు అవునండీ అని చెప్పినందుకు చాలా గర్వపడుతున్నాను. మన తెలంగాణా రాష్ట్రంలో మొదటి విద్యాశాఖ మంత్రి గారు చాలా ఉత్సాహవంతులు, విద్యావంతులు, తెలివిగలవారు. అయితే ఒక పాఠశాల గుర్తింపు పొందడానికి కావాల్సిన ప్రతిపాదనలు ఏమిటి? అసలు ఆ ప్రతిపాదనలు ఎప్పుడు సమర్పించుకోవాలి ? ఎందుకంటే ఇప్పుడు అర్బనైజేషన్ జరుగుతోంది. రంగారెడ్డి జిల్లాలో కాలనీలు ఎక్కువగా వస్తున్నాయి. ప్రభుత్వమే ఆ కాలనీలలో పాఠశాలలు నిర్వహించాలి కాని ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదు. ప్రైవేటు వాళ్లు పెట్టాలంటే మీకు గుర్తింపు ఉందా అని అంటారు. వచ్చే సంవత్సరం పాఠశాల పెట్టాలంటే ఈ సంవత్సరం సెప్టెంబర్‌లో ప్రపోజల్ పెట్టాలి. ప్రపోజల్ పెట్టాలంటే పిల్లలు ఎంతమంది, టీచర్స్ ఎంతమంది, తరగతి గదుల వివరాలు ఏమిటి అని అడుగుతున్నారు. అసలు స్కూలే పెట్టకపోతే ఈ వివరాలన్నీ ఎలా వస్తాయి? ఇటువంటి విధానం మన తెలంగాణా రాష్ట్రంలో ఉండద్దని కోరుతున్నాను. అసలు ప్రతిపాదనలు నిర్దిష్టంగా ఎలా పెట్టాలనే దాని గురించి ఒక స్పష్టమైన విధానానికి రూపకల్పన చేయాలని మంత్రి గారిని కోరుతున్నాను. రూపకల్పన చేసి దానిని సరైన విధంగా అమలు పరిచినప్పుడే గుర్తింపులేని

పాఠశాలలు అనే మాట లేకుండా పోతుంది. మన బిడ్డలందరూ ఎల్.కె.జి, యు.కె.జీ గుర్తింపు లేని పాఠశాలల్లోనే చదువుతున్నారనే విషయం మనందరికీ తెలుసు. కాబట్టి అటువంటి చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా? పాఠశాలలకు గుర్తింపుకు ఏ విధంగా, ఎటువంటి ప్రపోజల్ పంపాలి అనేటటువంటి వాటి గురించి ఒక విధాన నిర్ణయం తీసుకున్న తరువాత ప్రభుత్వం యాజమాన్యాల మీద చర్య తీసుకుంటే బాగుంటుంది కాని, కేవలం నామమాత్రంగా ఇలా జవాబులు ఉండకూడదని భావిస్తున్నాను. జిల్లా విద్యాశాఖ అధికారులమీద చర్య తీసుకుంటాము అంటున్నారే కాని, ఫలితం ఉండడం లేదు కాబట్టి ప్రభుత్వం విధానపరమైన చర్యలేమైనా తీసుకుంటున్నదా? రెండవది, మన ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్.కె.జి, యు.కె.జీ తరగతులు పెట్టకుండా ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో చదవద్దంటే పిల్లలు ఎక్కడకు పోయి చదవాలి? ప్రభుత్వ విధానం స్పష్టంగా ఉన్నప్పుడు మాత్రమే వారిమీద చర్యలు తీసుకోవడానికి అవకాశముంటుంది.

جناب سید امین الحسن جعفری (Sri Syed Aminul Hasan Jafri): صاحب! حیدرآباد میں بہت سارے اسکول function کر رہے ہیں، اور ہر بار یہی ہو رہا ہے کہ academic year شروع ہونے کے بعد آپ ان کو notices دیتے ہیں اور academic year ختم ہونے کے وقت آپ ایسا کریں کہ آپ ان کے لئے one time ایک اسکیم شروع کیجئے، یہ deadline ہو کہ جو بھی unrecognized ہیں وہ اپنے facilities کو مکمل کریں اور وہ upgrade کرنے کے بعد recognization کے لئے apply کریں اور پھر one time جو اسکیم ان کے لئے one time settlement کی بھی ایک اسکیم لائیں۔ دوسری چیز یہ ہے کہ آج کل جو unrecognized schools اس لئے بھی آ رہے ہیں کہ پچھلے پچیس تیس سال سے جو private schools چل رہے تھے، aided schools چل رہے تھے آج کل aided schools بہت سارے بند ہو چکے ہیں یا بند ہو رہے ہیں، اس کی ایک وجہ یہ ہے کہ جو ٹیچرس aided schools میں رہتے ہیں ان کے recruitment پر جو ٹیچرس کو recruit نہیں کیا جا سکتا ہے، اور جو ٹیچرس نہیں رکھ سکتے اور جو retired Teachers ہو رہے ہیں، ان کے vacancies پر نہیں کر سکتے، وہ اسکولس کے بھی facilities up to the mark نہیں ہو رہے ہیں، ویسے بھی آپ اس کے لئے ایک اسکیم نکالیں، اس کے بعد بھی اگر ایک آدھ اسکول function کر رہا ہے تو ان کو نوٹس دے سکتے ہیں۔

శ్రీ జి. జగదీశ్‌రెడ్డి : అధ్యక్షా, గౌరవసభ్యులు చాలా ఉత్సాహంగా చర్చలో పాల్గొని, ప్రస్తుతమున్న విద్యావ్యవస్థ ఎలా ఉందనే విషయాన్ని సభ ద్వారా తెలంగాణా ప్రభుత్వ దృష్టికి, సమాజం దృష్టికి తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. కొంతమంది కొత్త విషయాలు, మరికొంతమంది చెప్పిన విషయాలే చెప్పారు. ఆశ్చర్యమేమిటంటే.. మొన్న మేము నోటీసులు పంపించిన స్కూళ్లకు సంబంధించిన లిస్టు తెప్పించుకుని చూశాను. దాదాపు ఇరవై ఐదు సంవత్సరాలుగా నడుస్తున్న స్కూళ్లు కూడా ఇప్పటివరకు గుర్తింపు కోసం కనీసం దరఖాస్తు కూడా పెట్టుకోలేదు. దాదాపు వెయ్యినుండి పదిహేనువందల పిల్లలుండి, ఆ ప్రాంతంలో రెప్యుటేషన్ ఉన్న స్కూళ్లుకూడా దరఖాస్తు చేసుకోలేదు. అటువంటి స్కూళ్లకు మా విద్యాశాఖ అధికారులు వెళ్లి స్కూళ్లను మూసివేస్తామని నోటీసులు ఇవ్వడం జరిగింది. అయితే నగరానికి, ఇతర ప్రాంతాలకు చెందిన ఎమ్.ఎల్.ఎలు, ఎమ్.ఎల్.సిలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా వాటి గురించి రిప్రజెంటేషన్స్ ఇవ్వడం జరిగింది. ఇప్పుడు కూడా మిత్రులు జాఫ్రీ గారు కూడా కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనాక మీరు నోటీసులు ఇచ్చారు, ఇలా కాకుండా One time settlement చేయమని కోరారు. అలాగే పెద్దలు సుధాకర్ రెడ్డిగారు కూడా నిబంధనలు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. ఏ ప్రభుత్వమైనా నిబంధనలు రూపొందిస్తుంది. గతంలో కొన్ని నిబంధనలున్నాయి. ప్లే గ్రౌండ్‌కు, రూమ్‌లకు, టీచర్స్‌కు సంబంధించి స్పష్టంగా నిబంధనలున్నాయి. అర్హులైన ఉపాధ్యాయులని నియమించాలని, గ్రామీణ ప్రాంతాలలో 2,000 స్క్వేర్ మీటర్ల స్థలం ఉండాలి, పట్టణ ప్రాంతాలలో 1,000స్క్వేర్ మీటర్ల స్థలం ఉండాలని ఉంది. అన్ని సదుపాయాలున్నప్పటకీ, దాదాపు ఇరవై ఐదు సంవత్సరాలుగా నడుస్తున్న స్కూళ్లు కూడా ఇప్పటివరకు గుర్తింపు కోసం కనీసం దరఖాస్తు కూడా పెట్టుకోలేదు. మరి వాళ్లకు తెలిసి పెట్టుకోలేదా తెలియక పెట్టుకోలేదా? అనేది తెలియదు. ఆ విషయం గురించి అధికారులు కూడా పట్టించుకోలేదు. అలా కొంత ఇబ్బంది జరిగిన మాట వాస్తవమే. పోతే, ప్రీప్రైమరీకి సంబంధించి ప్రభుత్వ అనుమతి ఉన్నదా అని గౌరవసభ్యులు జనార్థన్‌రెడ్డి గారు అడిగారు. వాస్తవానికి ప్రీప్రైమరీకి సంబంధించి ఇంతకుముందు నిబంధనలు ఏమీ రూపొందించలేదు. ఇంకా ఇతర మిత్రులు నర్సారెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు నిర్మాణానికి నాలుగు నుండి ఐదు లక్షలు ఖర్చు పెట్టావు, కానీ అవి నిరుపయోగంగా ఉంటున్నాయన్నారు. అది వాస్తవమే. అయితే గత ప్రభుత్వాలు తప్పు చేశాయనుకోవడానికి లేదు కాని, కొంత నిర్లక్ష్యం చేసిన మాట మాత్రం వాస్తవమే. కొన్ని సందర్భాలలో అక్కడున్న విద్యార్థుల సంఖ్యను బట్టి వెంటనే అక్కడ పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఆ తరువాత కాలంలో వలసల వల్ల కావచ్చు, ఇంగ్లీషు మీడియం మీద మోజు కావచ్చు వివిధ కారణాలవల్ల విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి అక్కడున్న పాఠశాలలు మూతపడే పరిస్థితి వచ్చింది. కొన్ని చోట్ల కౌన్సిలింగ్ విధానం వల్ల రెండు, మూడు సంవత్సరాల క్రితం ఆరోజు అక్కడున్న విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయుల్ని నియమించడం, తరువాత కాలంలో పిల్లలు వెళ్లిపోవడం వల్ల ఇరవైమంది విద్యార్థులున్న చోట పది మంది ఉపాధ్యాయులుండడం కూడా జరుగుతోంది. ఇలా కొన్ని రకాల ఇబ్బందులున్న మాట వాస్తవమే. అయితే ప్రతీ సంవత్సరం కూడా రేషనలైజేషన్ చేయడమనేది జరుగుతోంది. కాని, గత రెండు,

మూడు సంవత్సరాలుగా అది చేయడం లేదు. దాంతో ఇప్పుడు కొంచెం ఎక్కువగా వ్యత్యాసాలున్నాయి. ఎక్కువ మంది పిల్లలున్నచోట తక్కువమంది ఉపాధ్యాయులు ఉండడం, తక్కువ మంది పిల్లలున్నచోట ఎక్కువ మంది పిల్లలుండడం జరుగుతోంది. రేషనలైజేషన్ కోసం ఇప్పటికే మేము ఆదేశాలు ఇచ్చాము. అయితే అది ఎప్పుడూ కూడా అక్టోబరు మాసం తరువాత చేయడం జరుగుతోంది. వివరాలను తీసుకొని వచ్చే సంవత్సరానికి అమలు చేయాల్సి ఉంటుంది. ఇది ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితి. కొన్ని పాఠశాలలు నిర్లక్ష్యంతో రిక్గ్నిజేషన్ కోసం అప్లికేషన్ పెట్టుకోని వాళ్లు ఇప్పుడు అప్లికేషన్ పెట్టుకున్నారు. అవన్నీ పరిశీలించి అక్కడ తాగునీటి వసతి, మూత్రశాలల ఏర్పాటు, తగినన్ని రూములు, తగినంత స్టాఫ్, ఇతరసిబ్బంది తగినంత గ్రౌండ్ వంటివి నిబంధనల మేరకు ఉన్న వాటికి ఇప్పటికే అనుమతులు ఇచ్చాము. గౌరవ జాఫ్రీ గారు కోరినట్టు .. సరిచేసుకుంటామని చెప్పిన మిగతా వారికి కూడా కొంత సమయం కూడా ఇచ్చాము. అయితే, కార్పొరేటు కళాశాలలు, పాఠశాలలకు సంబంధించి మిత్రులు దిలీప్‌గారు, జనార్ధన్ రెడ్డి గారు ఇతరులు కూడా ప్రశ్నించారు. వాస్తవానికి ఈరోజు విద్యా వ్యవస్థ ఇంత అస్థవ్యస్థంగా తయారుకావడానికి కారణం కార్పొరేట్ రంగమే. వాళ్లు బోర్డ్ ఆఫ్ సెక్రటరీని, ఇంటర్మీడియట్ బోర్డ్‌ను వాళ్లకుఅనుకూలమైన పద్ధతిలో శాసిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులను ఎలా అయితే విశ్వాసం లేకుండా చేశారో, ప్రభుత్వ పాఠశాలలను కూడా అలాగే విశ్వాసం లేకుండా చేసే పరిస్థితిని సృష్టించారు. దానివల్ల కూడా కొంత నష్టం జరిగిన మాట వాస్తవం. మిత్రులు మాసాయిపేట సంఘటనను కూడా ఉదాహరించారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే.. మాసాయిపేట సంఘటనలో ఏ ఏ గ్రామాల పిల్లలు చనిపోయారో ఒకసారి పరిశీలిస్తే, ఆ గ్రామాలన్నింటిలో ప్రభుత్వ పాఠశాలలున్నాయి. తగినంతమంది అర్హులైన ఉపాధ్యాయులున్నారు. అన్ని పరీక్షలు ఉత్తీర్ణులైన క్వాలిఫైడ్ ఉపాధ్యాయులున్నారు. ప్రైవేటు స్కూల్స్‌లో ఇచ్చే జీతాల కన్నా మనమే ఎక్కువగా జీతాలు ఇస్తున్నాము. అయినప్పటికి పిల్లలు ప్రైవేటు పాఠశాలలకు ఎందుకు వెళ్లారని నేను పరిశీలించాను. దానిలో మనకు తెలియవచ్చిన అంశం ఏమిటంటే.. ఇంగ్లీషు మీడియం మీద మోజు పెరిగి మూడు సంవత్సరాలకే LKG, UKG, నర్సరి అని పిల్లలను పాఠశాలలకు పంపిస్తున్నారు. కాని ప్రభుత్వ పాఠశాలల్లో ఐదు సంవత్సరాలు నిండని వారిని పాఠశాలల్లో చేర్పించుకోవద్దనే నిబంధన ఉంది. అక్కడేమో మూడు సంవత్సరాలకు తీసుకునే అవకాశం వుంది. దానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో కూడా LKG, UKG లు ప్రవేశపెడదామా, లేక ఇంగ్లీషు మీడియం ప్రవేశపెడదామా అని గత రెండు,మూడు నెలలుగా విద్యాశాఖాధికారులందరిని పిలిచి సీరియస్‌గా ఆలోచిస్తున్నాము. కానీ ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడానికి అంతర్జాతీయంగా విరుద్ధవాదనలు ఉన్నాయి. నాల్గవ తరగతి వరకు అమ్మ భాషైన మాతృభాషను దూరము చేయవద్దు అని ఒక వాదం ఉంది. మరి ఇప్పుడు ప్రపంచంతో పోటీపడి మన పిల్లలు కూడా ఎదగాలి అంటే ఇంగ్లీషు మీడియం విద్య అవసరం, లేకపోతే ప్రభుత్వ పాఠశాలలు నిలబడవు. మొత్తం ఉన్నవారు, లేనివారు అనే తేడా లేకుండా రోజు కూలినాలి చేసుకుని బతుకుతున్న వాళ్లు కూడా ఒక పూట వాళ్లు ఉపవాసం ఉండైనా ఎక్కువ ఫీజు చెల్లించి ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు కాబట్టి ప్రభుత్వం కూడా దీని మీద సీరియస్‌గా ఆలోచన చేయాలని చాలా వైపుల నుండి విజ్ఞప్తులు వస్తున్నాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ముఖ్యమంత్రిగారు కూడా సీరియస్‌గా చర్చించాల్సిన విషయం ఇది. తప్పకుండా దీనికి సంబంధించి ఈ విద్యాసంవత్సరం ముగిసే లోపు లేక మళ్లీ విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి అన్ని పక్షాలు, ప్రతిపక్ష మిత్రులందరినికూడా పిలిచి, అఖిల పక్షసమావేశం కూడా ఏర్పాటు చేసి కె.జి టు పి.జి కి సంబంధించి కొత్త పాలసీని రూపొందిస్తాము. అట్లాగే, ఇతర అంశాలకు సంబంధించి తప్పకుండా కొత్త పాలసీలు కూడా మనం రూపొందించుకోవలసి ఉంది. రేపు హైదరాబాదు ఐటిఐఆర్‌గా వస్తుంది కనుక దానిలో వచ్చే లక్షల ఉద్యోగాలలో ఎక్కువ భాగం మన పిల్లలు తీసుకోనే విధంగా ఉండాలంటే విద్యావ్యవస్థలో ప్రమాణాలు పెంచాల్సిన బాధ్యత మనపై ఉంది కాబట్టి తప్పకుండా కొత్త పాలసీని రూపొందించేటప్పుడు గౌరవ సభ్యులందరి సూచనలను, అన్ని పార్టీల సూచనలను తీసుకొని ఫైనల్‌గా ఒక మంచి పాలసిని రూపొందించుకుందాము. తెలంగాణాలో ఒక గొప్ప విద్యావిధానాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి గారు కూడా ఆలోచిస్తున్నారు. కాబట్టి ఇప్పుడు ఉన్నంత మేరలో వీలైనంత మెరుగ్గా రూపొందిస్తూ కొత్త పాలసీలు రూపొందించుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వం కూడా గుర్తించింది. ఈ విషయంలో గౌరవ సభ్యులందరూ కూడా సూచనలు చేసినందుకు ధన్యవాదములు తెలియజేస్తూ, ఉన్నంత మేరలో మంచిగా నడుపడానికి, ఇప్పుడు ఉన్నంత మేరకైనా ప్రైవేటు స్కూళ్లన్నీ పనిచేసే పద్ధతిలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ అరికెల నర్సారెడ్డి : అధ్యక్షా, ఎడ్యుకేషన్ విషయంలో గత ప్రభుత్వాలు అవి తెలుగుదేశం కావచ్చు, కాంగ్రెస్ ప్రభుత్వం కావచ్చు మౌలిక సదుపాయాలను చాలా సఫిషియంట్‌గా ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో పాఠశాల భవనాలున్నాయి. టీచర్స్ ఉన్నారు. ఇప్పుడు గవర్నమెంటు స్కూల్స్‌లో ఇంగ్లీషు మీడియం లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల మీద మోజు తగ్గి ప్రైవేటు స్కూళ్లకు వెళ్లిపోతున్నారు కాబట్టి దానిని ఎలా రెక్టిఫై చేయాలనే దాని గురించి మనం ఆలోచించాలి. సుధాకర్‌రెడ్డిగారు చెప్పినట్లు నర్సరీ లేకపోవడమనేది రెండవ అంశం. ఎప్పుడో చేసిన యాక్ట్ ప్రకారం మనము ఐదు సంవత్సరాల తరువాత స్కూల్లో చేర్చుకోవాలి, దానికి ముందు చేర్చుకోకూడదని ఉంది. చట్టాలను మార్చుకోవాలి. ఎప్పుడో చేసిన చట్టాలను మనమెందుకు పాటించాలి. మూడు సంవత్సరాలకే ప్రైవేటు స్కూల్‌కు పిల్లలు పోతున్నప్పుడు, గవర్నమెంటు పాఠశాలలో ఎందుకు చేర్చుకోకూడదనేది ప్రభుత్వం ఆలోచించాలి. దానిని మార్చుకోవాలి. ప్రతి స్కూల్లో ఇంగ్లీషు మీడియం పెట్టడానికి ఆలోచించాలి.

మరొక అంశం ఏమిటంటే.. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న 300 పాఠశాలలు గుర్తించడం జరిగింది. వాటిల్లో 150 పాఠశాలలకు మరల పర్మిషన్ ఇచ్చామని ప్రభుత్వం వారు చెబుతున్నారు. గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, అధికారులు మాత్రం వీరే. 300 పాఠశాలల్లో 150 పాఠశాలలకు మరల పర్మిషన్ ఇచ్చామని చెబుతున్నారు. ఈ 150 పాఠశాలలకు ఏవిధంగా పర్మిషన్ ఇచ్చారు? దానికున్నటువంటి standards ఏమిటి? ఏమి పరిశీలించి పర్మిషన్ ఇచ్చారు? గతంలో చూశారా, చూడలేదా అనే అనే విషయాన్ని ప్రక్కన పెడదాం. 300 పాఠశాలల లిస్ట్, ఈ 150 పాఠశాలల లిస్టులు రెండింటిని మాకు submit చేయాలని కోరుతున్నాను. ఈ 150 పాఠశాలల్లో ఏ standardsను చూసి, ఏవిధంగా inspection చేసి, పరిశీలించి అనుమితి ఇచ్చారో తెలుపుతూ ఆ లిస్ట్ ఇవ్వవలసిందిగా నేను మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ జి. జగదీశ్ రెడ్డి .: అధ్యక్షా, గౌరవ సభ్యులు కోరినట్లుగా తప్పకుండా వారికి లిస్ట్ తమ ద్వారా అందజేస్తాము.

ఇప్పుడున్న నిబంధనలు ఏమైతే ఉన్నాయో, వాటిని తప్పకుండా పాటించిన స్కూల్స్‌కి అనుమతి ఇచ్చాము. వాస్తవానికి, అన్ని సదుపాయాలు ఉండి, మంచి రెప్యుటేషన్ కూడా ఉండి కనీసం అప్లికేషన్ పెట్టుకోవాలనే ఆలోచన కూడా రాని స్కూల్స్ ఆ లిస్ట్‌లో ఉన్నాయి. అలాంటి వారు ముందుకొచ్చినప్పుడు మన అధికారులు వెళ్లి పరిశీలించి ఇప్పుడున్న నిబంధనల ప్రకారం సరిపోయినంత అకామడేషన్, సరిపోయిన సిబ్బంది, లాబొరేటరి సదుపాయం, గ్రౌండ్ ఉన్న వారు ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ అయితే రూ.25వేలు, సెకండరీ స్కూల్స్ అయితే రూ.50 వేలు డిపాజిట్ చేయవలసి ఉంటుంది. అలాగే Drinking water, toilet facilities ఉండి ఇప్పటి వరకు చట్టంలో ఉన్న నిబంధనలను పూర్తిగా అమలు చేస్తూ, అప్లికేషన్ పెట్టుకున్న వారికి రికగ్నైజ్ చేశాము. ఇంతకుముందు జాఫ్రీ గారు చెప్పినట్లు.. నిబంధనలను పాటించని పాఠశాలలను సడన్‌గా రద్దు చేస్తే పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుంది కాబట్టి కొంత సమయం ఇస్తే లోపాలను సరిదిద్దుకుంటామని దరఖాస్తును పెట్టుకున్న వారికి కూడా కాలపరిమితితో కూడిన అనుమతిని ఇవ్వడం జరిగింది. అన్ని నిబంధనలను పాటిస్తామని వారితో undertaking తీసుకున్న తరువాత మాత్రమే అవి కూడా కొనసాగేటట్టు అనుమతించాం. ఆ లిస్ట్ కూడా గౌరవ సభ్యులకు తమ ద్వారా అందజేయడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

11.00 ఉ. శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, ఉదాహరణకి నేను వచ్చే సంవత్సరం పాఠశాల ప్రారంభించాలంటే ఈ సంవత్సరమే ప్రపోజల్స్ పెట్టాలి. టీచర్స్ లేరు, పిల్లలు లేరు, భవనం లేదు, అలాంటపుడు నేను ఎలా ప్రపోజల్ పెట్టాలి? ఒక ప్రాంతంలో పాఠశాలకు అవసరమైన అన్ని వనరులు, వసతులుంటే అక్కడ ఉండే మండల విద్యాధికారి పరిశీలించి అనుమతి ఇచ్చే విధంగా యంత్రాంగం ఉండాలి. అలాగాకుండా 1956 నాటి నిబంధనలే ఇప్పటికీ అమలు చేస్తామంటే ఇక మనదేమి రాష్ట్రం? నేనొక నిరుద్యోగ ఉపాధ్యాయున్ని, నాకు ఉద్యోగం దొరకడం లేదు, నేనొక వాడలో పాఠశాల ప్రారంభించ దలుచుకున్నాను, అన్ని వనరులతో స్కూల్, పిల్లలు, టీచర్స్‌ను ఏర్పాటు చేశాం, అన్నీ ఉన్నాయో లేదో చూసి పర్మిషన్ ఇచ్చే ఒక యంత్రాంగం కావాలి. వచ్చే సంవత్సరం సెప్టెంబర్ నుంచి పెట్టండంటే ఎవరు పెడతారు? మళ్లీ ఆంధ్రా వాళ్లే వచ్చి పెడతారు, మళ్లీ వాళ్లకే ప్రోత్సాహం ఇచ్చినట్లవుతుంది కాబట్టి ఇప్పటికైనా ఆ నిబంధనలు మార్చి నిర్దిష్టంగా ఒక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని కోరుతున్నాను.

శ్రీ ఫారూక్ హుస్సేన్: అధ్యక్షా, ప్రైమ్ మినిస్టర్ స్వచ్ఛ్ భారత్ కార్యక్రమాన్ని తీసుకున్నారు, దాని ప్రకారం తెలంగాణా జిల్లాల్లో ఉండే స్కూల్స్‌లో టాయిలెట్స్ నిర్మించే ఆలోచన ఉందా?

శ్రీ జి. జగదీష్‌రెడ్డి: అధ్యక్షా, ప్రభుత్వం కొన్ని చట్టాలు, కొన్ని నిబంధనలు ఏర్పాటు చేసుకుని దాని ప్రకారం ముందుకు పోవడం జరుగుతుంది. ఒక స్కూలు, లేదా కాలేజీ పెట్టాలనుకుంటే దానికి సంబంధించి ఏమి కావాలో నిర్దేశించే నిబంధనలున్నాయి. ఈ మధ్య కాలంలో వాళ్లు చెప్పింది నా దృష్టికి కూడా వచ్చింది. ఒక గ్రామ స్థాయిలో డిగ్రీ కాలేజీ పెట్టుకోవడానికి అనుమతి కోసం నాదగ్గరికి

ఒకరు వచ్చారు. నేను చెప్పాను, ఒక గ్రామంలో డిగ్రీ కళాశాల ఎలా నడుస్తుంది, అది నడవాలంటే ఇంటర్మీడియేట్ పాసైన విద్యార్థులు చుట్టుప్రక్కల వెయ్యి, పదిహేను వందల మంది ఉండాలి, అక్కడ ఏ కళాశాల లేకుండా ఉండాలి,అప్పుడే సాధ్యమవుతుందని చెప్పాను. ఆ పిల్లాడు ఎక్కడో హుజూరాబాదులో ఒక ప్రైవేటు స్కూల్‌లో పని చేస్తున్నాడు, వారు చెప్పినట్లు అతను నిరుద్యోగే. అక్కడ కళాశాల పెట్టుకుంటే విద్యార్థులు వస్తారనే ఆశతో అడిగాడు. అది కరెక్టు కాదని నేను అతనికి చెప్పి discourage చేశాను. ప్రభుత్వ ఉద్యోగాలు లేక నిరుద్యోగులు చాలా మంది స్కూల్స్ పెట్టుకుంటున్న మాట వాస్తవమే. నిబంధనలు ఆల్ రెడీ ఉన్నాయి, ఇప్పటి వరకు ఉన్న వాటి మేరకే మనం పనిచేయవలసి ఉంటుంది, అంతకు మించి పని చేయలేం. ఒక ప్రైమరీ స్కూలు పెట్టాలన్నపుడు ఈ నిబంధనలు పాటిస్తే గుర్తింపు ఇవ్వాలని ఉంది. అయితే ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా మీడియం, వయసు మరియు ఇతర అంశాలకు సంబంధించి పాలసీలో కొన్ని మార్పులు తీసుకరావలసిన అవసరం ఉంది, కానీ ఉన్న నిబంధనలు తప్పని చెప్పలేము, ఆరోజున్న పరిస్థితుల వల్ల ఆ నిబంధనలు పెట్టారు. మారిన పరిస్థితుల్లో మనం వాటిని మార్చుకోవలసి ఉంది. గౌరవ సభ్యులు చెప్పిన వాటిని పరిగణన లోకి తీసుకుంటాం. ప్రజలకు అనుకూలంగా, ప్రయోజనకరంగా ఉండేలా ప్రభుత్వం రూల్స్ రూపొందించవలసిన అవసరం ఉంటుంది. ఆ పద్ధతుల్లో తీసుకుంటాం, అటువంటి కొత్త చట్టం రూపొందించేటప్పుడు గౌరవ సభ్యులు సుధాకర్ రెడ్డి గారి సలహా కూడా తీసుకుంటాం .

సభ్యులు ఫారూక్ హుస్సేన్ గారు స్కూల్స్‌లో టాయిలెట్స్ వసతి గురించి అడిగారు. ఇంతకు ముందే ఈవిషయం గురించి చర్చించాం. ఇప్పటి వరకు మన తెలంగాణ రాష్ట్రంలో బాలికలకు టాయిలెట్స్ లేని 2122 స్కూల్స్‌ని గుర్తించాం. మంచినీటి వసతి లేని 4వేల పైచిలుకు స్కూల్స్‌ను గుర్తించాం. కేంద్ర ప్రభుత్వ నిర్మల్ భారత్ అభియాన్ పథకం క్రింద ప్రతి సంవత్సరం ఈ పనులకు నిధులిచ్చి చేపట్టడం జరుగుతోంది. విద్యా హక్కు చట్ట క్రింద ఈ వసతులు తప్పకుండా కల్పించాలని సుప్రీంకోర్టు కూడా సీరియస్‌గా చెప్పడం జరిగింది. ఈ మధ్య కాలంలో దీని మీద దృష్టి సారించారు. అంతకు ముందు నిర్లక్ష్యం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కూడా అలాగే నిర్మల్ భారత్ అభియాన్ క్రింద చేపడతామంటే, మన పంచాయతీరాజ్ శాఖా మంత్రి గారు ఢిల్లీ వెళ్లి అక్కడ సంబంధిత మంత్రి గారిని కలిసి హామీ తీసుకుని రావడం జరిగింది. వచ్చే ఆగస్టు మాసం లోపల 100శాతం స్కూల్స్‌లో టాయిలెట్స్, మంచినీటి వసతి కల్పించే పనులను పూర్తి చేయాలని పెట్టుకున్నామని చెప్పడం జరిగింది. కానీ అనుకోకుండా ఒక పది రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక సర్క్యులర్ వచ్చింది. దాన్ని నిర్మల్ భారత్ అభియాన్ నుంచి స్వచ్ఛ భారత్-స్వచ్ఛ విద్యాలయాల కార్యక్రమం క్రింద మార్చామని చెప్పారు. నిర్మల్ భారత్ అభియాన్ క్రింద రూ.197కోట్లు వస్తే, మొత్తం వసతులు పూర్తి చేయడానికి మనం ప్రపోజల్స్ పంపించాం. అయితే వాటిని తిరస్కరిస్తూ, సియస్ఆర్ క్రింద కొన్ని కార్పోరేటు కంపెనీలను ఐడెంటిఫై చేశాం, వాళ్లద్వారా ఈ పనులను చేయించుకోండని లిస్టు పంపించారు. కేంద్ర ప్రభుత్వం ఒక ఐదు సంస్థలను గుర్తించి పంపిస్తే, ఒక 176 స్కూల్స్‌ని గుర్తించి వాటిల్లో పనులు చేస్తామన్నారు. వచ్చే వారం నేను, గౌరవ ఐటి మంత్రిగారు ఇద్దరమూ కలిసి ఒక సమావేశం ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ఇక్కడ ఉన్న ఐటి సంస్థలను పిలిపించి, వచ్చే ఆగస్టు లోపల ఈ పనులను వారి ద్వారా పూర్తి చేసేలా లక్ష్యాన్ని పెట్టుకున్నాం. సియస్ఆర్ క్రింద దీనికి ప్రాధాన్యత ఇవ్వడానికి ముందుకు రావాలని కోరాం. 70సంస్థలతో ఇప్పటికే ఐటి మంత్రిగారు సంప్రదించారు. వాళ్లు కూడా సంసిద్ధత వ్యక్తం చేశారు. వారం, పది రోజుల్లో ఒకసమావేశం ఏర్పాటు చేసి, ఎవరెవరు ఏ జిల్లాలో, ఏ తాలూకాలో చేయాలో బాధ్యతలు అప్పజెపుతాం. వచ్చే ఆగస్టు లోపల తప్పకుండా పాఠశాలల్లో ఈ వసతులను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. కొత్తగా వచ్చిన బయో టాయిలెట్స్ బాగున్నాయని, ఎకో ఫ్రెండ్లీ గా ఉన్నాయని అంటున్నారు. నేను కూడా మెదక్ జిల్లా, ఇస్నాపూర్‌కి వెళ్లి వీటిని చూసి వచ్చాను. వచ్చే ఆగస్టు లోపల అన్ని పాఠశాలల్లో టాయిలెట్స్, మంచినీటి వసతులు పూర్తి చేస్తామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ప్రశ్న నెం. 148 ..

సర్వశ్రీ కర్నె ప్రభాకర్, ఎస్, రాములు నాయక్, ఎమ్మెల్సీలు

గౌరవనీయులైన విద్యాశాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో 9వ, 10వ తరగతి పరీక్షా విధానాన్ని మార్చే ప్రతిపాదన ఏదైనా ఉందా?

ఆ) అయితే ఆ వివరాలు ఏమిటి?

విద్యాశాఖా మంత్రి (శ్రీ జి. జగదీష్‌రెడ్డి):

అ) అవునండీ

ఆ) 2014-15 విద్యా సంవత్సరం లగాయితూ, 9వ, 10 వ తరగతుల పరీక్షలలో సంస్కరణలను ప్రభుత్వం చేపట్టింది. పిల్లల తార్కికత, విశ్లేషణాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పరీక్షించడంపై పరీక్ష సంస్కరణలు దృష్టిని సారిస్తాయి. ఈ సంస్కరణలు జవాబు

లను బట్టీ పట్టడం, గైడ్లను, స్టడీ మెటీరియల్స్ మొదలైన వాటిని ఉప యోగించడాన్ని నిరుత్సాహ పరుస్తాయి. సంస్కరణలు పరీక్షా సబ్జెక్టులుగా కో-కరిక్యులర్ కార్యకలాపాలను చేర్చడం ద్వారా పిల్లలను అన్ని విధాల అభివృద్ధి పరచడంపై శ్రద్ధ వహిస్తాయి.

గతంలో 100శాతం మార్కులు ఫైనల్ పరీక్షలో ఇచ్చేవారు. ఇప్పుడు అది మార్చి 20మార్కులు స్కూల్స్‌లో ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. గతంలో మాదిరిగా 11పేపర్లుంటాయి. ద్వితీయ భాషకి ఒకటే ఉంటుంది, మిగతా సబ్జెక్ట్‌లకి రెండేసి పేపర్లుంటాయి. పబ్లిక్ పరీక్షలో 80 మార్కులు, అంతర్గత మూల్యాంక నంలో 20 మార్కులు ఇస్తున్నాం. అంతర్గత మూల్యాంకనంలో గ్రంథా లయాలలో పుస్తకాలు చదవడం, బాల సాహిత్యం చదివి నివేదికలు రాయడం, ప్రాజెక్టులు చేసి రికార్డులు రాయడం, సమకాలీన అంశాల మీద రికార్డులు రాయడం వంటివి ఉంటాయి. పబ్లిక్ పరీక్షల్లో వచ్చే ప్రశ్నలు కూడా వీలైనంత వరకు విశ్లేషణాత్మక శక్తిని పెంచే పద్ధతిలో ఉండాలి, మూస పద్ధతిలో ఉండకూడదని నిర్ణయం తీసుకోవడం జరిగింది. విద్యా హక్కు చట్టానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసు కోవడం జరిగింది. ఇప్పటికే ఈ పద్ధతిలో మూడు నెలల పరీక్షలు నిర్వహించడం జరిగింది. పిల్లల్లో మంచి ఇంప్రూవ్‌మెంటు కని పించింది. ఆరు నెలల పరీక్షలు కూడా త్వరలో నిర్వహించబోతున్నాం. ఈ పద్ధతి వల్ల ఎక్కువ మేలు జరుగుతోందన్నది అందరి నుంచి వస్తున్న సమాచారం. పిల్లలు దీన్ని రిసీవ్ చేసుకోగలుగుతారా అనే అనుమా నాలు ముందు వ్యక్తం చేశారు. టీచర్స్ mould అవుతారా అనే అనుమానాలు కూడా వ్యక్తం చేశారు. కానీ ఇటీవల ముగిసిన మూడు నెలల పరీక్షలలో మంచి ఫలితాలు కనిపించాయి. ఉపాధ్యాయులకు దీనికి సంబంధించి శిక్షణ పూర్తి చేశాం . పరీక్షలు ఎలా నిర్వహించాలో వాళ్లందరికీ కరదీపికలు కూడా ఇచ్చాం . విద్యార్థులకు బాగా ఉపయో గపడుతుందని ఈ విధానం ప్రవేశపెట్టడం జరిగిందని గౌరవ సభ్యు లకు తెలియజేస్తున్నాను.

శ్రీ కర్నె ప్రభాకర్ : అధ్యక్షా, నూతన రాష్ట్రంలో నూతన విద్యా విధానం. నిజానికి నూతన విద్యా విధానంలో పిల్లల్లో సృజనాత్మకత, కొత్త ఆలోచనలతో చదువుకోవాలనే ఆసక్తి పెంపొందించేలా చర్యలు తీసుకున్నందుకు ఈ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. పిల్లవాడు బాగా చదువుకుంటే వంద మార్కులు రావడం కాదు, పోటీ పరీక్ష లకు తగినట్లుగా తయారుకావడం అవసరం. ఈరోజు వంద మార్కులు రాగానే తల్లిదండ్రులు సంతోషపడుతున్నారే తప్ప పోటీ పరీక్షలలో సరైన రీతిలో రాణించకపోవడమన్నది ఈ సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఒక పెద్ద వ్యాధిగా నేను భావిస్తున్నాను. ఇంతకు ముందు మంత్రిగారు చెప్పినట్లు, గైడ్లను అనుసరించడం సరైన పద్ధతి కాదు. 25సంవత్సరాల క్రితం నేను మా ఊర్లో ఉన్న స్కూల్‌లో చదువుకు న్నాను, అప్పుడు ప్రైవేటు విద్యా సంస్థలు లేవు. అనివార్యంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. మా ఊరు నల్గొండ జిల్లాలోని సంస్థాన్ నారాయణ్‌పూర్, ఇది చాలా పెద్ద ఊరు. కాలక్రమేణా అక్కడ కూడా ప్రైవేటు స్కూల్స్ వచ్చాయి. నాలుగైదు సంవత్సరాల క్రితం ఈ ప్రభుత్వ పాఠశాల మూత పడుతుందేమోననే భయం వేసింది. చివరికి అందులో 30మంది విద్యార్థులు చేరారు. చదువు చెప్పడా నికి సరైన ఉపాధ్యాయులుంటే, సరైన చర్యలు తీసుకుంటే ప్రభుత్వ పాఠశాలలు ఎలా బాగుపడతాయో చెప్పడానికి మా ఊరిని ఒక ఉదా హరణగా చెబుతున్నాను. నాలుగు సంవత్సరాల క్రితం 130 మంది విద్యార్థులున్న మా ఊరి ప్రభుత్వ పాఠశాలలో ఈరోజు 400మంది విద్యార్థులు చేరడం జరిగింది. కారణం ఏమంటే - అక్కడ పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు. పిల్లలకి పోటీ పరీక్షలకి తర్ఫీదు ఇచ్చే విధంగా అక్కడ విద్యా విధానం కొనసాగుతోంది. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత 70 నుంచి 80 శాతం ఉంటుంది. కానీ మా ఊరి ప్రభుత్వ పాఠశాలలో మాత్రం 100శాతం ఉత్తీర్ణత కనిపి స్తోంది. కారణం - ఆ ప్రధానోపాధ్యాయుడు చూపిస్తున్న శ్రద్ధ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువు చెప్పే పద్ధతుల్లో మార్పులు తీసుకొచ్చారు. ప్రైవేటు పాఠశాలలకి ధీటుగా అది పని చేస్తోంది, ఆ స్థాయిలో మా ప్రభుత్వ పాఠశాల పని చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నూతన విద్యా విధానం ద్వారా ఇటువంటి మార్పులు తీసుకురావడానికి అవకాశం ఉంటుంది. దాన్ని అనుసరించి సమాధానం చెప్పిన మంత్రిగారికి ధన్యవాదాలు .

శ్రీ సబావత్ రాములు నాయక్: అధ్యక్షా, మన మంత్రివర్యులు మొత్తం క్వశ్చన్‌కి ఆన్సర్ చెప్పారు. కానీ రెండు విషయాలను మంత్రి గారి దృష్టికి తీసుకొస్తున్నాను. గౌరవమంత్రివర్యులు విద్యావంతులు, అన్ని విషయాలు వారికి తెలుసు. బట్టీ పట్టే విధానాన్ని ఎలా రూపు మాపుతారో చెప్పాలని కోరుతున్నాను, వారిపైన పెద్ద బాధ్యత ఉంది. కెజి టు పిజి ఉచిత నిర్బంధ విద్య అంటున్నారు, ఈ బట్టీ విధానాన్ని ఎప్పటి నుంచి రూపుమాపుతారు? కర్నె ప్రభాకర్ గారు చెప్పినట్లుగా, ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా బలోపేతం చేయవలసిన అవ సరం ఉంది. మేము చదువుకునే సమయంలో బట్టీ విధానం లేదు. జనరల్‌గా క్వశ్చన్ వస్తే ఆలోచించి దానికి జవాబు రాసేవాళ్లం . కానీ ఇప్పుడు కోఠి బస్ స్టాప్ దగ్గరికి పోతే అన్ని రకాల గైడ్లు దొరుకుతు న్నాయి. ఈ గైడ్ విధానానికి స్వస్తి చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి: అధ్యక్షా, ఇది మంచి విద్యా విధానం. ఎందుకంటే విద్యార్థి దశ నుంచే విద్యార్థులు స్వతహాగా ఆలోచించే

జిజ్ఞాస కలిగించాలనే ఉద్దేశ్యంతో ఈ విద్యా విధానం తీసుకొచ్చారు. ఈ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టినపుడు కూడా నేను చెప్పడం జరిగింది. ఈ విద్యా విధానం మంచిదే కానీ దీనికి అనుగుణంగా మన పాఠశాలల్లో పరిస్థితులున్నాయా అనే ఆలోచన చేయవలసిన అవసరం ఉంది. విద్యా విధానానికి అనుగుణంగా పాఠశాలలు, తరగతి గదులలో పరిస్థితులు లేకపోవడం వల్ల గతంలో ఎన్నో విద్యా విధానాలు విఫలమయ్యాయి. ఈ విద్యా విధానంలో బట్టీ పట్టే సిస్టం గాకుండా, గైడ్ల మీద ఆధారపడకుండా విద్యార్థి స్వతహాగా ఆలోచించే విధంగా దీన్ని రూపొందించారు. దీనికి అనుగుణంగా మనం సిలబస్ రూపొందించాం, ఈ రెండింటికీ అనుగుణంగా మనం పరీక్షా విధానాన్ని రూపొందించుకున్నాం. ఈసారి పదవ తరగతి విద్యార్థులు కొత్త విధానాన్ని పాటిస్తున్నారు, కొత్త పరీక్షా విధానాన్ని ఎదుర్కొంటున్నారు. పదవ తరగతి అన్నది విద్యార్థిని లైఫ్‌లో టర్నింగ్ పాయింట్. ఈరోజు విద్యార్థుల్లో గానీ, టీచర్స్‌లో గానీ కొంత అయోమయ పరిస్థితి ఉంది. కొత్త పాఠ్యాంశాల మీద అవగాహన కల్పించకపోవడం, కొత్త పరీక్షా విధానం మీద విద్యార్థులకు అవగాహన లేకపోవడం వల్ల అయోమయం ఉంది కాబట్టి మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను, ఈ సంవత్సరం పదో తరగతి విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని కొంచెం సిలబస్ తగ్గించే అవకాశం ఉందా? పరీక్షా విధానంలో కొంత వెసులుబాటు కల్పించాలని కోరుతున్నాను. స్వతహాగా ఆలోచించే విధంగా 50శాతం, పాఠ్యపుస్తకం నుంచి 50శాతం క్వశ్చన్స్ ఇచ్చినట్లయితే పదో తరగతి విద్యార్థులను ఆదుకునే అవకాశం ఉంటుంది.

కో–కరిక్యులర్ యాక్టివిటీస్ ఈ విద్యా విధానంలో ఉన్నాయి. నేను చాలా పాఠశాలలు సందర్శించడం జరిగింది. క్రాఫ్ట్, డ్రాయింగ్, మ్యూసిక్, హెల్త్ ఎడ్యుకేషన్, మోరల్ వ్యాల్యూస్ మీద టైమ్ టేబుల్ కేటాయించాం కానీ ఆ ఉపాధ్యాయులను నియమించకపోవడం వల్ల గ్రౌండ్ లెవల్‌లో ఇబ్బంది ఉంది. ఆ ఉపాధ్యాయుల నియామకం చేసే విధంగా చర్యలు చేపడతారా?

ఈరోజు టీచర్స్‌కి టీచింగ్‌కన్నా రిటెన్ వర్క్ ఎక్కువైంది. ఉపాధ్యాయుడు బోధనకే పరిమితం అయ్యేలా, రిటెన్ వర్క్‌ని తగ్గించే అవకాశం ఏమైనా ఉందా? ఈ సిస్టం సక్సెస్ కావాలంటే టీచర్–స్టూడెంట్ రేషియో తప్పకుండా మెయిన్‌టెయిన్ చేయవలసిన అవసరం ఉంది. నేను పాఠశాలలన్ని సందర్శించినపుడు గమనించాను, ఒక సెక్షన్‌లో 80 నుంచి 100 మంది విద్యార్థులున్నారు. రేషనలైజేషన్ చేయమని చెబుతున్నాం, అది నిరంతర ప్రక్రియ. సమ్మర్‌లో చేయమన్నాం, అకాడమిక్ ఇయర్ మధ్యలో చేపడితే ఇబ్బంది అవుతుందని చెప్పాం. ఒక టీచర్‌కి 25మంది విద్యార్థులుంటే ఈ విద్యావిధానాన్ని విజయవంతం చేయగలుగుతాం కాబట్టి ఈ రేషియోని మెయిన్‌టెయిన్ చేయడానికి ఏదైనా చర్య తీసుకోవాలని కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్: ఒక ఉపాధ్యాయుని ప్రశ్నే ఇంత పెద్దగా ఉంటే, విద్యార్థులు ఎలా రాస్తారు?

11.20 ఉ. శ్రీ పాతూరి సుధాకర రెడ్డి : అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రంలో ఇంకా నూతన విద్యావిధానం రాలేదు. ఈసంవత్సరం కేవలం పరీక్షల సంస్కరణలు చేస్తున్నాం. ఈరోజు 10వ తరగతి పరీక్షల సంస్కరణలో గ్రేడింగ్ విధానాన్ని పెట్టారు. గ్రేడింగ్ విధానంలో 10వ తరగతి పరీక్షల్లో 80 మార్కులు written testMìü ఉంటాయి. 20మార్కులు internal assessment కి ఉంటాయి. ఇప్పుడున్న 9, 10వ తరగతులకు ఈ పరీక్షా విధానాన్ని పెడుతున్నారు. 9వ తరగతి, 10వ తరగతి internal assessment మార్కులను చూసి 20 మార్కులు వేస్తాం. కానీ, ఈసంవత్సరమే పరీక్షల సంస్కరణల విధానం ప్రవేశపెట్టుట వల్ల 9వ తరగతి మార్కులు ఇప్పుడు లేవు ఎలా? 9వ తరగతి, 10వ తరగతి internal assessmen మార్కులను చూసి 20 మార్కులకు కుదిస్తరా? లేకపోతే, కేవలం 10వ తరగతి పరీక్షల్లోనే internal assessment చేసి దానికి ఆ 20 మార్కులు వేస్తారా? అనేదానికి స్పష్టత ఇవ్వాల్సిందిగా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

పరీక్షల సంస్కరణలు ఒకవైపు అయితే, ప్రశ్నా పత్రాల సంస్కరణలు కూడా ఇప్పుడే చేపట్టారు. గతంలో బట్టీ పట్టేటువంటి విధానం ఉండేది, వాటిని సంస్కరించి ఈసారి అలా చేయడం లేదని అంటున్నారు. దానిని మాత్రం మా విద్యార్థులు చాలా హర్షిస్తున్నారు. అసలు ప్రశ్నా పత్రం యొక్క బ్లూప్రింట్ ఎలా ఉంటుంది? అసలు మేము ముగ్గురం ఉపాధ్యాయ ఎమ్మెల్సీలం ఉన్నాం. ఒక్కనాడన్నా మమ్మల్ని సంప్రదించారా అధ్యక్షా. ఒకవైపు పాఠ్యపుస్తకాల్లో మార్పులు తీసుకువచ్చాం. పరీక్షల సంస్కరణలు తీసుకువచ్చాం. వీటన్నింటిని ఛౌeుఇట్బుజ్చీుటఱజీర్ఫ్ గా ఆలోచన చేసి, మన ప్రభుత్వానికి అపవాదు రాకుండా, అలా జరుగకుండా, నిర్దిష్టంగా పరీక్షలు ఇలా ఉంటాయి. ప్రశ్నాపత్రం యొక్క బ్లూప్రింటు ఇలా ఉంటుందని నిర్దిష్టమైన సూచనలు ఇవ్వాలని గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ కె.యాదవ రెడ్డి : (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, నేను ఇంతకుముందే ఒక విషయంలో నా ఆవేదన వ్యక్తం చేశాను. ఒక రూల్స్ కమిటీ వేసి సరైన నిబంధనలు తెస్తే తప్ప, లేదంటే ఏ సబ్జెక్ట్‌కి ఎంత సమయం ఇస్తామనేది సబ్జెక్ట్ వైజ్ డివైడ్ చేయండి. ఎందుకంటే చాలా ముఖ్యమైన ప్రశ్నలు వాయిదా వేస్తున్నారు. ఒకటే ప్రశ్నకు ఇంత సమయం తీసుకోవడం మంచి సంప్రదాయం కాదు.

మీరు రూల్స్ కమిటీ ఎప్పుడు వేస్తారు అదైనా చెప్పండి. ఈ సెషన్‌లో ఎలాగు రాదు. ప్రత్యేక సమావేశం పెట్టి విద్య అంశం మీద ప్రత్యేకంగా చర్చించుకుందాం.

శ్రీ పోట్ల నాగేశ్వర రావు : (స్థానిక సంస్థలు) అధ్యక్షా, అరగంటకి ఒక ప్రశ్న అయిపోతది. ఆరు సంవత్సరాల నా అనుభవాన్ని బట్టి చూస్తే ప్రశ్న signatory కి అవకాశం వస్తుంది. కాని, 15మంది అనుబంధ ప్రశ్నలు వేస్తే ఎట్లా? లఘు చర్చకంటే ఎక్కువ సమయం తీసుకుంటే ఎలా. ఏదైనా రూల్స్ ఫ్రేమ్ చేసుకోకపోతే సభ ఆర్డర్‌లో నడువదు.

جناب سید امین الحسن جعفری (Sri Syed Aminul Hasan Jafri): یہ جو نئی ریاست میں نئے reforms کے بارے میں کہا گیا ہے، نئی ریاست میں جو پرانے reforms ہیں، آندھراپردیش کی جو حکومت تھی، reforms کا پورا blueprint تیار کیا گیا تھا، جیسے ہی تلنگانہ بنا، جو academic year شروع ہو رہا ہے، آپ لوگوں نے دو جی اوز جاری کئے۔ جو پرانے reforms تھے، آپ انہیں reforms کو implement کرنا شروع کیجئے۔ دوسرے چیز یہ ہے کہ ٹیچرس کے لئے orientation نہیں ہوا، کچھ اسکولس کے لئے orientation نہیں ہوا، ایسے ہی طلبہ کے لے awareness campaign نہیں ہوا، اس کو فوراً ہی enforce کر دیجئے۔ نیا syllabus، نیا reform، نیا examination pattern، اور اس کے اندر آپ changes بھی کئے تھے جیسا تلگو میں 20 مارکس سے 35 کر دئے تھے، پہلے یہ جو تھا کہ تلگو کے مارکس count نہیں ہوتے تھے، آپ جو اسکو include کر دئے تھے تو کل ان چیزوں کے بارے میں Education Minister نے کہا ہے کہ Status Quo کو maintain کیا جائے گا، تلگو کے 20 مارکس رکھیں گے، اس کو include نہیں کریں گے، دوسرے total میں اس کو include نہیں کریں گے تو اس کے لئے ایک جی او نکالنا۔۔۔

శ్రీ జి.జగదీష్ రెడ్డి : అధ్యక్షా, ఈరోజు ప్రవేశపెడుతున్న విద్యావిధానం ఏదైతే ఉన్నదో, ఇది పరీక్షలకి అని కాదు. ఇది వాస్తవానికి బోధనా పద్ధతికి. ఈపద్ధతి అవలంభించకపోవడం వల్ల ఈదేశం ఎంతో నష్టపోయింది. పిల్లల్లో అద్భుతమైన సృజనాత్మకత ఉంటుంది. ఉదాహరణకు మనం ఒక కొత్త సెల్ ఫోన్ తీసుకువచ్చి ఒక పిల్లవాడి ముందు పెడితే అర్థగంట లోపల ఆ పిల్లవాడు దానిని ఎలా ఆపరేట్ చేయాలనేది మనకే చెప్పే పరిస్థితి ఉంటుంది. పిల్లలు అంత చురుకుగా ఉంటున్నారు. పెద్దలు శ్రీ పాతూరి సుధాకర రెడ్డి గారు చెప్పినట్లు పరీక్ష విధానం మీద అవగాహన లేదు ఎలా? బ్లూప్రింట్ లేదని అంటున్నారు. అది కరెక్ట్ కాదు. ఇప్పటికే త్రైమాసిక పరీక్షలు అదే పద్ధతిలో నిర్వహించాం. ఫలితాలు మంచిగానే వచ్చాయి. మోడల్ పేపర్స్ కూడా ఇప్పటికే రూపొందించాం. ఉపాధ్యాయులకు కూడా శిక్షణలు ఇప్పించాం. ఆ పద్ధతులు కూడా వెబ్‌సైట్‌లో పెట్టాం. ఇంకోటి 9వ, 10వ తరగతి మార్కులు కలిపి అసెస్ చేస్తున్నామని అన్నారు. అది కరెక్ట్ కాదు. కేవలం 10వ తరగతి అసెస్‌మెంట్ మార్కులనే పదవ తరగతి ఫైనల్ మార్కులతో కలుపుతాము. కానీ, 9వ తరగతివి 10వ తరగతిలో తీసుకోము. పరీక్షలు ఏ సంవత్సరానికి సంబంధించినవి, ఆ సంవత్సరానికే ఉంటాయి. ఉపాధ్యాయులు కూడా మాకు చెప్పరాదు, అర్థం కావడం లేదనేది ఏమి లేదు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించినప్పుడు వారు చిన్న, చిన్న అనుమానాలని వ్యక్తం చేశారు. వాటిని నివృత్తి చేయడం జరిగింది. మనం ఇప్పటికే SCERT, RMSA ద్వారా శిక్షణలు కూడా ఇప్పించాం. ఇవన్నీ కూడా చదువుకున్న సబ్జెక్ట్‌లే. సిలబస్ గాని, సబ్జెక్ట్ గాని కొత్తగా చదివేది ఏమీ లేదు. ఏ పాఠ్యాంశాలైనా గతంలో చదివినవే. విధానాన్ని కొద్దిగా మార్చాం. వాస్తవానికి ఈ సందర్భంగా నాకు కూడా సమయం ఎక్కువగా తీసుకోవడం ఇష్టం లేదు. మిత్రులందరూ మిగతా ప్రశ్నలకు ఎదురుచూస్తున్నారు.

అధ్యక్షా, అనుకోకుండా ఏడు సంవత్సరాల క్రితం నా పిల్లవాడిని పాఠశాలలో చేర్చడానికి వెళ్లాను. నాకు వెళ్లేంత తీరిక లేదు. కానీ, వాడిని పాఠశాలలో చేర్పించాననే జ్ఞాపకం ఉండాలే, ఉద్యమంలో తిరిగితే ఎలా అని ఇంట్లోనుండి నిరసన వస్తే ఆ పాఠశాలకు వెళ్లాను. పాఠశాలలోని కరస్పాండెంట్‌ని పిలిచి మా పిల్లవాడికి క్లాస్ తీసుకునే ఉపాధ్యాయుడు ఎవరు? అతన్ని ఒకసారి పిలిపించమని అడిగాను. ఎందుకు సార్ ఇప్పుడు లేడు అని అన్నాడు. ఏమి లేదు, నేను ఒక్కటే చెప్పి పోదలచుకున్నాను. మీరు మావాన్ని బయపెట్టించి ఇట్లా చదువు, అట్లా చదువు అని అనడం అవసరం లేదు. కాని, వాడు అప్పుడప్పుడు కొన్ని ప్రశ్నలు వేస్తడు. ఆ ప్రశ్నలకు జవాబు చెబితే చాలు. గంత చదువు చాలు అని చెప్పాను. ఆయన సీట్లోంచి లేచి వచ్చి, నన్ను పట్టుకొని సార్ నేను పదేండ్లు అయింది పాఠశాల మొదలు పెట్టి ఇక్కడికి వచ్చిన తల్లిదండ్రులు మావోనికి ఎందుకు మార్కులు వస్తలేవు, మీరు కొడతలేరు, మీరు తిడతలేరు, మీరు గట్టిగ చెబుతలేరు అని అన్నారు గాని, ఇలా పిల్లల్లో సృజనాత్మకత పెంచాలి. అనుమానాలు వచ్చినప్పుడు ప్రశ్నలు వేస్తరు, వాడికి సమాధానం చెబితేనే వాడికి మళ్లీ ఆలోచనశక్తి పెరుగుతుంది, వాడు మళ్లీ ప్రశ్నలు వేస్తరు. అట్లా ఆలోచన శక్తిని పెంపొందించే పద్ధతుల్లో చదువు నేర్పించండని ఎవరూ అడగలేదు.

ఒక భయం లేకుండా, ఒక స్వేచ్ఛాయుత వాతావరణంలో చదువు చెప్పడం నేర్చుకోవడం అనేది ఉంటేనే ఈరోజు ఈదేశానికి కాబోయే గొప్ప శాస్త్రవేత్తలు, గొప్ప ఇంజనీర్లని, గొప్ప డాక్టర్లని అందించేందుకు

వీలవుతుంది. వీటన్నింటి దృష్టిలో పెట్టుకొని ఈ బట్టీ విధానం పోవాలని, పిల్లల్లో స్వంతంగా ఆలోచించడం, కొత్తవాటిని కనిపెట్టాలనే ఆలోచన రావడం, ప్రశ్నించడం రావడం, ప్రశ్నకు సమాధానాన్ని వెతుక్కోవడం కూడా వారినుంచే రావాలనే పద్ధతుల్లో ఇది ప్రవేశపెట్టబడ్డవిధానం. ఇది అన్ని ఆలోచించి పెట్టిన విధానం. కాకపోతే, ఈ సంవత్సరం నేను ఉపాధ్యాయ మిత్రులకు పలు సందర్భాల్లో ఇప్పటికే విజ్ఞప్తి చేయడం జరిగింది. ఇప్పుడు మీ బాధ్యత పెరిగింది. తెలంగాణ ఉద్యమంలో ఎలా భాగస్వామ్యం అయ్యారో దానిని ఇష్టపడి, ప్రేమించి. ఈరోజు మీ ఉపాధ్యాయ వృత్తిని, మీ బాధ్యతను కూడా ఇష్టపడి, ప్రేమించి గనుక నిర్వహిస్తే, తెలంగాణలో అద్భుతమైన సమాజాన్ని తయారు చేయవచ్చు. అట్లాంటి విద్యను అందించవచ్చు మీరు అదనపు సమయం కేటాయించైనా సరే పిల్లలకు ఆ రకంగా పాఠాలు బోధించాలి. కొత్తవిధానాన్ని అవలంభించి వారు స్వీకరించేట్లు చేయాలని వారికి విజ్ఞప్తి చేయడం జరిగింది.

మొత్తం తెలంగాణ ఉపాధ్యాయ లోకమంతా దానికి సిద్ధంగా ఉన్నారు. వారు ఆ పద్ధతిలో పని చేస్తున్నారు. తప్పకుండా ఒక మంచి విద్యా విధానాన్ని రూపొందించుకున్నాం. దీనిద్వారా రేపటి తెలంగాణకు ఒక మంచి గొప్ప పౌరులను తయారు చేసే దానిలో ఈ విద్యావిధానం ఉపయోగపడుతుందని దానికి మనందరం కూడా మద్ధతివ్వాలని మీద్వారా గౌరవ సభ్యులందరికీ తెలియజేస్తున్నాను.

## హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాల్లో ప్రత్యేక ఉద్యానవన ప్రాంతం

ప్రశ్న నెం. 168 (10)

డా. కె. నాగేశ్వర్, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

(అ) హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాల పరిసరాలలో ప్రత్యేక ఉద్యానవన జోన్‌ని అమలు పర్చేందుకు ఏదైన ప్రతిపాదన ఉందా;

(ఆ) అయితే, ఆ వివరాలేమిటి; ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య పరిశ్రమలు, పాడి పరిశ్రమాభివృద్ధి, విత్తన సంస్థ శాఖ మంత్రి (శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి)

(అ) అవునండీ.

(ఆ) షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించడానికి 75 శాతం సబ్సిడీపై రూ.252.00కోట్ల అంచనా వ్యయంతో హైదరాబాదు చుట్టుప్రక్కల 100 కి.మీ. వ్యాసార్ధం లోపల 1000 ఎకరాల విస్తీర్ణంలో గ్రీన్‌హౌజ్‌లను నిర్మించడానికి సంబంధించిన ఒక పథకాన్ని ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తున్నది.

డా .కె. నాగేశ్వర్ : (పట్టభద్రుల నియోజక వర్గం) అధ్యక్షా, నేను అడిగిన ప్రశ్న స్పెషల్ హార్టీకల్చర్ జోన్ గురించి. గౌరవ మంత్రి గారు గ్రీన్ హౌజ్ గురించి చెప్పారు. రెండు ఒకటేనా? ఎందుకంటే, గతంలోనే ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి గారైన శ్రీ కె. రోశయ్య గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్పెషల్ హార్టీకల్చర్ జోన్ అనౌన్స్ చేశారు. నేను జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో మరియు గత శాసన మండలి సమావేశంలో లేవనెత్తడం జరిగింది. గత ప్రభుత్వం స్పెషల్ హార్టీకల్చర్ జోన్ assure చేసింది. అది, ఇది ఒకటేనా? లేక అది మార్చి ఇప్పుడు గ్రీన్ హౌజ్ అంటున్నారా? మీరు చిన్నా, సన్నకారు రైతులకు 75శాతం సబ్సిడీతో ఇస్తామంటున్నారు. కాని, ఒక గ్రీన్ హౌజ్‌కు ఎంత ఖర్చు అవుతుంది? నాకు తెలిసినంతవరకు రూ. 40 నుండి రూ.45 లక్షల వరకు అవుతుంది. ఈ రూ.45లక్షలు చిన్నా, సన్నకారు రైతులు ముందే పెట్టుబడిపెట్టుకోవాలా? పెట్టుకున్న తరువాత మీరు సబ్సిడీ ఇస్తారా? లేదా ముందే సబ్సిడీ ఇస్తారా? నేను చదివింది పత్రికల్లో తప్పుంటే మంత్రి గారు సరిచేయాలి. ముందు చిన్నా, సన్నకారు రైతులు పెట్టుబడి పెట్టుకోవాలి. తరువాత వారికి 75 శాతం సబ్సిడీ వస్తుందని అన్నారు. ఈ రాష్ట్రంలో చిన్నా, సన్నకారు రైతులు రూ.45లక్షలు పెట్టుబడి పెట్టుకునే వారు ఉంటారా? ఉండనప్పుడు ప్రభుత్వం ముందే సబ్సిడీ ఇచ్చే కార్యక్రమం ఏమైనా చేస్తుందా?

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి : (బాన్సువాడ) అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైనటువంటి సబ్జెక్ట్. హార్టీకల్చర్ జోన్ అనే విషయంలో మాట్లాడేటప్పుడు, హైదరాబాద్ అవసరాల కొరకు తెలంగాణ రైతుల ద్వారా మనం ఉత్పత్తి చేస్తున్నటువంటి కూరగాయలు కేవలం 15 నుండి 20 శాతం. మిగతా ఉత్పత్తులన్నీ కూడా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ మరియు ఇతర రాష్ట్రాలనుండి వస్తున్నాయి. నేను మంత్రి అయిన తరువాత ఐదవ రోజు, ఆరవ రోజు కొన్ని మార్కెట్లు సందర్శిస్తే, మొత్తం వాహనాలన్నీ అక్కడినుండే వస్తున్నాయి. కాబట్టి, గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ 15, 20 శాతం కూరగాయల్ని పెంచడం కోసం, తెలంగాణ రైతంగాన్ని ప్రోత్సహించడం కోసం. గతంలో ఈ గ్రీన్ హౌజ్ పైన 50శాతం సబ్సిడీ మాత్రమే ఇచ్చేవారు మొత్తం యూనిట్లో. దానిని 50శాతం పెడితే మీరన్నట్లుగా చిన్నా, సన్నకారు

రైతులు మోయలేరని, పేదవారికి ఇబ్బంది అవుతుందని 50 శాతం సబ్సిడీని 75 శాతం సబ్సిడీగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఆ 75 శాతం సబ్సిడీతో ప్రత్యేకంగా కూరగాయల కోసం, వెయ్యి ఎకరాలల్లో ఈయొక్క కార్యక్రమాన్ని విస్తరించడానికి నిర్ణయం తీసుకున్నాం.

11.40 ఉ. వాస్తవానికి ఈ గ్రీన్ హౌసింగ్ ప్రోగ్రామింగ్ అనేది 2005-06వ సంవత్సరంలో మొదలైంది. అప్పటి నుండి నేటి వరకూ సమైక్య పాలనలో తెలంగాణా రైతాంగానికి కూరగాయలు, పూలు ఉద్యానవన శాఖను కేవలం 129 ఎకరాల విస్తీర్ణంలో రూ.24కోట్లతో ప్రోత్సహించింది. అయితే, ఈ ఒక్క సంవత్సరమే గౌరవ ముఖ్యమంత్రిగారు వెయ్యి ఎకరాలు టార్గెట్ ఇచ్చి రూ.252కోట్లు బడ్జెట్‌ను కేటాయించారు. సబ్సిడీ విషయం కూడా గౌరవ సభ్యులు అడిగారు. స్ట్రక్చర్ నిర్మాణం కోసం, కూరగాయలు పెట్టే ప్లాంట్స్, డ్రిప్ ఇరిగేషన్ తో పాటు మట్టి బోదెలు పోసుకోవడానికి మొత్తం ఎంతైతే ఖర్చవుతుందో వాటికొరకు 3 ఎకరాలు మించకుండా సీలింగ్ పెట్టి 75 శాతం సబ్సిడీఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అధ్యక్షా, తమరు అనుమతిస్తే – ఈ గ్రీన్ హౌస్ నమూనాను నేను చిన్న ప్లాస్టిక్ వస్తువులాగా తయారు చేసి తీసుకువచ్చాను. అందరికీ బాగా అర్థమవుతుందనే ఉద్దేశ్యంతో నేను తీసుకువచ్చాను. దానిని ప్రవేశపెట్టడానికి తమరు అనుమతిస్తే నేను చూపిస్తాను.

(గ్రీన్ హౌస్ నమూనాను సభలో చూపించారు)

ఇందులో కూరగాయలు, మధ్యలో బోదెలు, డ్రిప్ ఇరిగేషన్, ఇంటర్ కల్టివేషన్ కూడా ఈ నమూనాలో ఉన్నది. దీనికి వర్షాకాలం, ఎండాకాలంతో సంబంధం లేదు. పరిస్థితులు ఎలా ఉన్నా పంట పండుతుంది. ఎక్కువ చలితోనైనా పంట పండుతుంది. మూడు కాలాలకు తట్టుకుని పంట పండే విధంగా ఈ టెక్నాలజీ ఉంటుంది. దీనివల్ల పది టన్నులు పండే పంట వంద టన్నులు పండుతుంది. కాబట్టి, దీనిని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రిగారు అధిక నిధులు ఇచ్చారు. వచ్చే సంవత్సరంలో కూడా ఈ విధానాన్ని అధిక మొత్తంలో ప్రోత్సహిస్తాము. పండించిన పంటకు మార్కెట్ సౌకర్యం లేకపోతే ఇబ్బంది కాబట్టి వంద కిలోమీటర్లు అని ముందు అనుకున్నాము. కాబట్టి మార్కెట్ సౌకర్యం ఉండే విధంగా హైదరాబాదుకు వంద కిలోమీటర్ల రేడియస్‌లో అని అనుకుని ప్రాధాన్యతనివ్వడం జరిగింది. అది కాకుండా ఎక్కడైనా మార్కెట్ సౌకర్యం ఉన్నది అనుకుంటే ఆయా పట్టణాలకు, పరిసర ప్రాంతాలకు ఈ సౌకర్యాన్ని కలిగిస్తాము. ముఖ్యంగా, ఈ రోజు డాక్టరు కావాలన్నా, ఇంజనీరు కావాలన్నా, పట్టభద్రులు కావాలన్నా మనిషికి ఆరోగ్యం ఉండాలి. ఆరోగ్యం లేని సమాజం అస్తవ్యస్తంగా ఉంటుంది. అందుకే ఈ రోజు మనిషి జీవించడానికి ప్రతి వస్తువుని మనం మిషన్‌లో వేసి తయారు చేస్తాము. కానీ, కూరగాయలను తయారుచేయలేము. మనిషి ఆరోగ్యాన్ని పరిరక్షించే శక్తి రైతు పండించే పంటలో ఉన్నది. గౌరవ నాగేశ్వర్ గారు అన్నట్లు, గ్రీన్ హౌస్ విధానాన్ని, కూరగాయల పెంపకాన్ని ఈ ప్రభుత్వం ప్రోత్సహించి ఈ ఒక్క సంవత్సరం అది కూడా మార్చి వరకే రూ. 252కోట్లు ఖర్చు పెట్టి వెయ్యి ఎకరాలకు ముఖ్యమంత్రిగారు ఇవ్వడం జరిగింది. హైదరాబాదు చుట్టుపక్కల ఎక్కడెక్కడ మార్కెంటింగ్ సదుపాయాలు ఉన్నాయో, వాటికి ప్రాధాన్యతనిస్తూ, మిగతావారు కూడా తమకు మార్కెటింగ్ సౌకర్యం ఉన్నది, ఇబ్బంది లేదు అనుకుంటే వారికి కూడా కల్పించే అవకాశం ఉన్నది. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో చిన్న పిల్లలు లివర్, కిడ్నీ వ్యాధులతో, ఎముకలు రకరకాల వ్యాధులతో, విటమిన్ లోపం వల్ల బాధపడుతున్నారు. ప్రజలు లక్షలు, కోట్లు ఆరోగ్యానికి ఖర్చుపెట్టుకుంటున్నారు. ఈ విధానం వల్ల విస్తీర్ణం పెంచడమే కాకుండా ఆరోగ్య పరిరక్షణ కోసం మంచి ఉత్పత్తులను తయారు చేసుకోగలుగుతాము. రోగం వచ్చిన తరువాత రోగాన్ని నిరోధించడం కంటే, ముందుగానే రోగం రాకుండా ఆపే శక్తి కేవలం రైతు దగ్గరనే ఉన్నదనే విషయాన్ని ఈ సందర్భంగా నేను మనవి చేస్తున్నాను.

ఉదాహరణకు కాబేజి సి విటమిన్ – రోగ నిరోధక శక్తినిస్తుంది. క్యాప్సికం, కారెట్, ఆకుకూరలు, గుమ్మడి, సొరకాయలలో ఎ విటమిన్ ఉంటుంది. ఇది కంటి చూపును, రక్త కణాలను వృద్ధి చేస్తుంది. టమాట, వంకాయలలో ఎ మరియు సి విటమిన్లు ఉంటాయి. బీన్స్, పచ్చిబటాణీ, చిక్కుడులలో క్యాల్షియం ఉంటుంది. మునగ, గోంగూరలో ఐరన్ ఉంటుంది. కాబట్టి, రైతులకు ప్రోత్సాహమిస్తే ప్రత్యక్ష, పరోక్షలాభం చేకూరుతుంది. ఆరోగ్యమే మహాభాగ్యం. పంటలు బాగా పండితే తద్వారా సమాజ ఆరోగ్యం కూడా బాగుంటుందనే ఉద్దేశ్యంతోటి 80 శాతం బయట నుండి వచ్చే ఉత్పత్తులను తగ్గించి, తెలంగాణా రైతుల ద్వారానే కూరగాయలు పండించాలనే లక్ష్యంతోటి ఈ కార్యక్రమాన్ని మేము ముందుకు తీసుకువెడుతున్నామని నేను సభ్యులకు మనవి చేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్: నాగేశ్వర్ గారు, మంత్రిగారు ఒక చిన్న ప్రకటన చేసిన తరువాత మీ ప్రశ్న కొనసాగుతుంది. ఇప్పుడు గ్యాస్ లీకేజీ సంఘటనపై మంత్రిగారు ప్రకటన చేస్తారు.

శ్రీ జి. జగదీశ్‌రెడ్డి: అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ ఫారూక్ హుస్సేన్ గారు ఇప్పుడే వార్త వచ్చిందని ప్రశ్న వేయడం జరిగింది. పెద్దపల్లిలోని ఒక కాలేజీలో గ్యాస్ లీక్ అవడం వల్ల అస్వస్థతకు గురైన విద్యార్థుల

గురించి ల్యాబ్‌లో గ్యాస్ లీకవడం వలన కాదు, సిబ్బంది బాత్రూములు శుభ్రం చేసేటప్పుడు ఎక్కువ మోతాదులో యాసిడ్, ఫినాయిల్‌ను ఉపయోగించి, వెంటనే డోర్లు క్లోజ్ చేసి వెళ్లిపోయారు. ఆ తరువాత ఫస్ట్ అవర్‌లో వచ్చిన విద్యార్థులు డోర్లు తీసి లోపలకు వెళ్లగానే, వచ్చిన పొగవల్ల కొంత ఇబ్బందికి గురైనారు. వారిని కరీంనగర్‌లో ఉన్న సన్‌రైజ్, అపోలో ఆసుపత్రికి తరలించడం జరిగింది. అంతా క్షేమంగా ఉన్నారు. ఎవరికీ పెద్ద ప్రమాదమేమీ లేదు. చిన్న అస్వస్థతే గానీ, పెద్ద ప్రమాదం కాదని తమద్వారా గౌరవ సభ్యులకు తెలియ చేస్తున్నాను.

డా. కె. నాగేశ్వర్ః మంత్రిగారు చెప్పిన వివరాలకు కృతజ్ఞతలు కానీ, నేను అడిగిన ప్రశ్న ఏమింటే – ఒక గ్రీన్ హౌస్ పెట్టడానికి ఎంత ఖర్చవుతుంది? నా అంచనా తప్పుంటే మంత్రిగారు సరిచేయాలి. రూ. 40, 45 లక్షలు మినిమమ్ అవుతుంది. నేను చాలా గ్రీన్ హౌస్‌లను చూశాను, అమెరికాలో కూడా గ్రీన్ హౌస్‌ను చూశాను. 75 శాతం సబ్సిడీ అంటే రూ.30 లక్షలు ప్రభుత్వం ఇస్తుంది. ఇంకో రూ.15 లక్షలు రైతు పెట్టుకోవాలి. ఈ సబ్సిడీ ముందు ఇవ్వకపోతే తెలంగాణాలో రెండు, మూడు ఎకరాలు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు రూ.15లక్షల పెట్టుబడిని పెట్టగలిగే శక్తి ఉన్నదా? అందుకని ముందు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ ఇవ్వాలి. కాబట్టి ముందు సబ్సిడీ ఇస్తారా అని నేను అడిగాను. ముందు 25 శాతం పెట్టుకోమని అంటే ఏ చిన్న సన్నకారు రైతులు పెట్టుకోరు. మనలాంటి రైతులే వెళ్లి గ్రీన్ హౌస్‌లు పెట్టుకునే పరిస్థితి వస్తుందని నేను మనవి చేస్తున్నాను.

శ్రీ ఎమ్. రంగారెడ్డి ః (శాసనసభ నియోజక వర్గం) అధ్యక్షా, గ్రీన్ హౌస్ పెట్టాలంటే, మొదటే పర్మిషన్ తీసుకోవాలా? రెండవది – ఒక రైతుకు 10, 15 ఎకరాల పొలం ఉంటుంది. అందులో 3 ఎకరాలు పెట్టుకోవచ్చా? లేక కేవలం 3 ఎకరాలు ఉన్న రైతే పెట్టుకోవాలా? ఈ రెండు విషయాలకు మంత్రిగారు సమాధానం చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ పొట్ల నాగేశ్వర రావు ః అధ్యక్షా, ఈ ప్రశ్నను మొత్తం మంత్రిగారు హైజాక్ చేసేశారు. డా. కె. నాగేశ్వర్ గారు అడిగిందేమంటే– స్పెషల్ ఎకనామిక్ జోన్‌లాగా హార్టీ కల్చర్ ప్రాంతాలను జోనల్‌గా గుర్తించే ప్రతిపాదన ప్రభుత్వం దగ్గర ఉన్నదా? అని అడిగితే, మంత్రిగారు గ్రీన్ హౌస్‌లకు వెళ్లిపోయారు. హైదరాబాదు చుట్టూ హార్టికల్చరల్ ప్రాంతాలు మెదక్, రంగారెడ్డిలలో ఉన్నాయి. అలాగే, ఖమ్మం వంటి ప్రాంతాలలో కూడా హార్టికల్చర్ జోన్స్‌ను గుర్తించే అవకాశం ఉన్నది. అటువంటి ప్రాంతాలను గుర్తించి జోనల్ సిస్టమ్‌లో హార్టీకల్చర్‌ను అభివృద్ధి చేయదల్చుకున్నారా అనేది నా ప్రశ్న.

శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ ః అధ్యక్షా, నేను మంత్రిగారిని కోరేదేమంటే, నిజామాబాద్ జిల్లాలో కూడా ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ ఉన్నారు. ఆర్మూరు, పాలకొండ, నిజామాబాదు రూరల్, ఇతర ప్రాంతాలలో గ్రీన్ హౌస్ గానీ, ఉద్యానవన పంటలు పండించడానికి మంచి ప్రావీణ్యం గల రైతులు, ఫౌండేషన్ సీడ్ పండించే రైతులు కూడా నిజామాబాద్ జిల్లాలో ఉన్నారు. గౌరవ మంత్రివర్యులు కూడా చాలా అనుభవం ఉన్న వ్యక్తి. వంద కిలోమీటర్లని నేను పత్రికలలో చూశాను. కూరగాయలు పండించడానికి గ్రీన్ హౌస్ చాలా మంచి కార్యక్రమం. చైతన్యవంతులైన రైతాంగం ఉన్నది కాబట్టి, దానిని, ఆర్మూరు, పాలకొండ వరకు విస్తరించి, రాబోయే కాలంలో ఉద్యానవన పంటలను పండించుకోవడానికి రైతాంగానికి అవకాశం ఇస్తారా అని మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ బి. వెంకటేశ్వర్లు ః అధ్యక్షా, మిత్రులు నాగేశ్వర్ గారు వేసిన ప్రశ్న చాలా బాగుంది. దానికి గౌరవ మంత్రివర్యులు చాలా వివరంగా అనేక విషయాలు సభకు తెలియచేశారు. మా మిత్రులు శ్రీ పొట్ల నాగేశ్వర రావు మంత్రిగారు హైజాక్ చేశారని మాట్లాడారు. ఎందుకుంటే, రైతు బిడ్డ పోచారం శ్రీనివాస రెడ్డి గారు మంచి అనుభవజ్ఞులు. ఇవాళ వారు వ్యవసాయం గురించి చెబుతూ, కూరగాయలు, వ్యాధినిరోధక శక్తి గురించి మంచి విషయాలు చెప్పారు. సన్నకారు, చిన్న కారు రైతులకు గతంలో 50 శాతం సబ్సిడీ ఇచ్చేవారు దానిని ఇప్పుడు 75 శాతం చేయడం ద్వారా రైతును పైకి తీసుకురావాలనే ఈ ప్రభుత్వ యొక్క మంచి ఉద్దేశ్యాన్ని నేను అభినందిస్తున్నాను. గతంలో ఏది పండించినా మనకు లాభసాటిగా ఉండడం లేదు. గ్రీన్ హౌస్ ద్వారా పేద రైతాంగాన్ని లాభసాటిగా పైకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో రూ.250కోట్లు పెట్టి పెద్ద ఎత్తున విస్తరింప చేయడం కూడా చాలా సంతోషం. అయితే, వంద కిలోమీటర్లు అని కాకుండా, ఆర్మూరు వంటి ప్రాంతాలకు వరంగల్ జిల్లా జనగాం ప్రాంతాలు ఉన్నాయి కాబట్టి ఆ పరిధి పెంచాలని మీ ద్వారా మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ కొంపల్లి యాదవరెడ్డి ః అధ్యక్షా, గతంలో రోశయ్య గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హార్టీకల్చర్ జోన్‌గా చేస్తామని బంటారం అనే గ్రామంలో ఒక ప్రకటన చేశారు. తరువాత ఏం చర్యలు చేపట్టారో మాకు తెలియదు. ఇప్పుడు కొత్త ప్రతిపాదన వచ్చిందేమంటే హార్టీ కల్చర్ జోన్ అంటే గ్రీన్ హౌస్ క్రిందకు వస్తుందా? కేవలం గ్రీన్ హౌస్ మాత్రమేనా లేకపోతే, వేరే రకంగా ఉన్నదానికి కూడా ప్రభుత్వం సహాయం చేస్తుందా? రెండవది – హార్టీ కల్చర్, గ్రీన్ హౌస్‌కు సింగిల్ ప్రతిపాదన ఎంత ఏరియాలో ఉంటుంది? దాని కాస్ట్ రూ.10 లక్షలు అవుతుందా? రూ.40 లక్షలు అవుతుందా? అనే వివరాలు కావాలి.

గ్రీన్ హౌస్‌కు పాలి హౌస్‌కు ఏమైనా తేడా ఉందా? ఎందుకంటే పాలిహౌస్‌లో రూ.3.50లక్షలకే ఒక యూనిట్ అవుతుంది. కానీ, గ్రీన్ హౌస్‌కు మాత్రం రూ.40లక్షలు యూనిట్‌కు అవుతుందని సభ్యులు శ్రీ నాగేశ్వర్ గారు అంటున్నారు. ఈ వివరాలను తెలియచేయాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పూల రవీందర్: గ్రీన్ హౌస్ కల్టివేషన్ అనేది హైదరాబాదు నుండి వంద కిలోమీటర్ల పరిధిలో అన్నారు. దానిని 150, 200కి.మీ. పరిధి వరకూ పెంచాలనేది ఒక విన్నపం. రెండవది, అన్ని జిల్లాలలో కూరగాయల పెంపకానికి ముందుకు వచ్చిన రైతులను ఖచ్చితంగా ప్రోత్సహించాలి. సేంద్రియ ఎరువులతో మాత్రమే కూరగాయలు పండించి, అందరి ఆరోగ్యం కాపాడేట్లుగా మంచి ఆలోచన చేసిన ముఖ్యమంత్రిగారు, దాంతో పాటు ఎరువుల వాడకాన్ని కూడా కంట్రోల్ చేయకపోతే చాలా నష్టం జరిగే ప్రమాదమున్నది. అధ్యక్షా, పండించిన రైతులకు ఇప్పటివరకూ చూస్తే వారికి రెండు రూపాయలు వస్తే, మధ్య దళారీలకు రూ.20లు వస్తున్నాయి. పండించిన రైతుకే గిట్టుబాటు ధర రావాల్సిన అవసరమున్నదని తమ ద్వారా గౌరవ మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి : గౌరవ సభ్యులు డా. కె. నాగేశ్వర్ గారు మాట్లాడినప్పుడు ఒక యూనిట్ కాస్ట్ ఎంత అని అడిగారు. ఒక ఎకరం అంటే 4వేల చ.మీ. దీనికి స్ట్రక్చర్ కట్టుకోవడానికి రూ.28లక్షలు అవుతుంది. రూ.700లు స్క్వే.మీ చొప్పున 4వేల స్క్వేర్ మీటర్లు. అందులో 75 శాతం సబ్సిడీ అంటే రూ.21లక్షలు. ప్లాంట్ మెటీరియల్, బోదెలు పోసుకోవడానికి, డ్రిప్‌కు రూ.5లక్షల 60వేలు అవుతుంది. అందులో 75 శాతం అంటే రూ.4లక్షల20వేలు సబ్సిడీ పోగా మిగతా రూ.1లక్షా 40వేలు రైతు కట్టుకోవాలి. ఇది ఎకరానికి వేసిన లెక్క.. ఒకవేళ ఎకరానికి చేతకాదు అనుకుంటే 500మీటర్లకో, 1000మీటర్లకో సాగు చేసుకుంటామనే సన్నకారు, చిన్నకారు రైతులను ప్రోత్సహిస్తాము. మాగ్జిమమ్ సీలింగ్ 3 ఎకరాలు. నాకు ఇంతే శక్తి ఉన్నది, 25 శాతం పెట్టుబడి నాతో కాదు అనుకుంటే వారికి కూడా ఇస్తాము. మాగ్జిమమ్ 3 ఎకరాలు అన్నాము గానీ, మినిమమ్ ఇంత అని లేదు కాబట్టి ప్రతి రైతును ప్రోత్సహించి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలనే ఉద్దేశ్యంతో ఉన్నాము. 100 కి.మీ. రేడియస్‌ని హార్టీ కల్చర్ జోన్ లాగా అభివృద్ధి చేయాలనేది మా ముఖ్యమంత్రిగారి లక్ష్యం. తప్పకుండా చేస్తామని మనవి చేస్తున్నాను. రంగారెడ్డి గారు మాట్లాడుతూ 3 ఎకరాలు ఉన్నవాళ్లకే ఇస్తారా? లేక 10 ఎకరాలు ఉన్నవాళ్లకు కూడా ఇస్తారా అని అడిగారు. అధ్యక్షా, రైతుకు 15 ఎకరాలు ఉండనీ, 50 ఎకరాలు ఉండనీ ఎంతైనా గానీ, మాగ్జిమమ్ సీలింగ్ 3 ఎకరాలు కాబట్టి వారికి ఈ ఫెసిలిటీ కలిగిస్తాము. రైతులు అప్లికేషన్ పెట్టుకుంటే మండల స్థాయి కమిటీ ఒకటి ఉంటుంది. అందులో వాళ్లు స్క్రూటినీ చేసి మంజూరు చేస్తారు. నిజామాబాదులో కూడా ఇటువంటి వసతి కల్పిస్తాము. ఎక్కడెక్కడైతే రైతు పండించిన పంట మళ్లా అమ్ముకుండా ఇబ్బంది పడే పరిస్థితి లేకుండా ఇటు వరంగల్ గానీ, ఖమ్మం గానీ, నిజామాబాదు గానీ రైతులు పండించిన పంటకు మార్కెట్ సౌకర్యం ఉంది అనుకుంటే ఆ ప్రాంత రైతులను కూడా ప్రోత్సహిస్తామని మనవి చేస్తున్నాను. యాదవరెడ్డిగారు అడిన దానికి – పాలిహౌస్ కూడా ఉన్నది. పండాల్ అంటే పందిళ్లు వేసి పండించే విధానం కూడా ఉన్నది. ఒకవేళ ఖర్చు పెట్టుకోవడానికి ఇబ్బంది అనుకుంటే, పందిళ్లు వేసుకుని కూరగాయలు పండించే విధానాన్ని కూడా ప్రోత్సహిస్తాము. ఎక్కువ వర్షం పడినా పెట్టిన చెట్టు నష్టపోతుంది. ఎక్కువ చలి ఉన్నా మొలక మొలవదు. ఎండకు, చలికి, వర్షానికి తట్టుకునే శక్తి ఇందులో ఉన్నది. అంతేకాకుండా బయట 10 టన్నులు పండితే గ్రీన్ హౌస్‌లో వంద టన్నులు పండుతుంది. 10 రెట్లు ఎక్కువగా ఈ సిస్టమ్ ద్వారా పంట పండే అవకాశం ఉంటుంది. అందుకని ఈ విధానాన్ని ప్రోత్సహిస్తున్నాము. చిన్న, సన్నకారు రైతాంగానికి మినిమమ్ వారి శక్తి మేరకు మినిమైజ్ చేసి సహాయం చేస్తాము.

**12.00 ని.** ఉదాహరణకు టమాటా బయట పండిస్తే పది టన్నులు, ఇందులో పండిస్తే ఎకరానికి వంద టన్నులు. వీటికి మార్కెట్ ధరను బట్టి లాభాలు వస్తాయి. క్యాప్సికం బయట ఆరు నుండి ఏడు టన్నుల వరకు పండుతుంది. ఇందులో డెబ్బై ఐదు టన్నులు వస్తాయి. దోసకాయ బయట రెండు నుండి మూడు టన్నుల కంటె ఎక్కువ పండదు. ఇక్కడ ముప్పై ఐదు టన్నుల వరకు పండుతుంది. క్యాలీఫ్లవర్ బయట మూడు నుండి నాలుగు టన్నులు, ఇక్కడ ముప్పై టన్నుల వరకు పండుతుంది. క్యాబేజీ బయట ఐదారు టన్నులు పండితే ఇక్కడ అరవై టన్నులు పండుతుంది. రేటుని బట్టి లాభాలు వస్తాయి. ఖర్చు విషయానికి వస్తే టమాటాకు ఎకరానికి స్ట్రక్చర్ కాకుండా లక్షరూపాయలు పెట్టుబడి, క్యాప్సికం మూడు లక్షలు, దోసకాయ, క్యాలీఫ్లవర్, క్యాబేజీలకు ఎకరానికి యాభైవేల చొప్పున ఖర్చవుతుంది. కొత్తిమీర, పాలకూర, మెంతికూర, గోంగూర లాంటివికూడా పండించవచ్చు. మన ముఖ్యమంత్రిగారికి ఒక మంచి ఆలోచన వచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 129 ఎకరాలు, రూ.24 కోట్లు మాత్రమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా రైతుల పరిస్థితి ఇది. కానీ 201415 సంవత్సరానికి రూ. 252కోట్ల రూపాయలతో 1,000 ఎకరాలలో పండించడానికి ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఎప్పుడూ ఇవ్వలేదు. ఒకసారి రాజేంద్రనగర్ వెళితే అక్కడ

ట్రక్చర్ ప్రాక్టికల్‌గా ఒకసారి చూడవచ్చు. అందరి లక్ష్యం ఒక్కటే. తెలంగాణాలో వినియోగించే కూరగాయలను బయటనుండి తెచ్చుకునే పని లేకుండా తెలంగాణా రైతుల ద్వారానే పండించాలి. అలా చేస్తే రైతులకు ఆదాయం వస్తుంది. తెలంగాణా ప్రజల ఆరోగ్యం కాపాడాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తున్నాం. దీనికి ఎక్కడా కూడా రాజీ పడేది లేదు. ముఖ్యంగా ఎస్.సి, ఎస్.టీ వ్యవసాయదారులకు ఈ రూ. 252 కోట్లలో రూ. 70కోట్ల వరకు ప్రత్యేకంగా కేటాయించడం జరిగింది. చిన్న, సన్నకారు రైతులను కూడా ప్రోత్సహిద్దాం. ఎక్కడా కూడా ముడెకరాల కంటె ఎక్కువ ఇచ్చేది లేదు. తక్కువలో తక్కువ ఎంతైనా ఫరవాలేదు. దానిద్వారా రైతాంగం ఆర్థికవనరులు పెంచుకునే విధంగా, ఆరోగ్యవంతమైన సమాజం తయారయ్యే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.

శ్రీ కొంపల్లి యాదవరెడ్డి : అధ్యక్షా, సభ్యులను ఒకసారి రాజేంద్రనగర్ తీసుకువెళ్లి చూపిస్తే బాగుంటుంది. తీసుకెళతామని మంత్రి గారు కూడా చెప్పారు.

మిస్టర్ ఛైర్మన్ : మంత్రిగారూ.. రాజేంద్రనగర్‌కు ఒకసారి తీసుకువెళ్లమని సభ్యులు కోరుతున్నారు.

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి : అధ్యక్షా, తప్పకుండా తీసుకువెళదాము.

శ్రీ డా. కె. నాగేశ్వర్ : అధ్యక్షా, ఈ విధంగా చేస్తే ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురి కాదు. పేదవారికి ఉపాధి కల్పించినట్లవుతుంది. నగరంలోని ప్రజలకూ కూరగాయలు వస్తాయి కాబట్టి ఈ పనిని చేయండి. హైదరాబాదు నగరంలో 1800 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని గత ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. హార్టీకల్చర్ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి, దానికిందకు ఈ 1800 ఎకరాలను బదలాయించి వెంటనే బందోబస్తు ఏర్పాటు చేస్తే బ్రహ్మాండంగా ఉంటుంది.

శ్రీ పొంగులేటి సుధాకర రెడ్డి : (శాసనసభ నియోజక వర్గం) అధక్షా, శని లేదా ఆది వారాలలో ఎప్పుడైనా ఎమ్.ఎల్.ఎ., ఎమ్.ఎల్.సిలందరికి కలిపి ఒక అవగాహనా సదస్సు పెట్టి దీనిమీద ఇంకా ముందుకు పోతే బాగుంటుంది. ఆలోచన చాలా బాగుంది.

మిస్టర్ ఛైర్మన్ : మంత్రిగారూ... రాజేంద్రనగర్ తీసుకువెళతారా?

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి : అధ్యక్షా, తప్పకుండా తీసుకువెళతాం. అందరి సహాయసహకారాలతో ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విస్తరించాలనేది ప్రభుత్వ లక్ష్యం. పారదర్శకంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళతాం.

## భూసార పరీక్షా సదుపాయాలు

ప్రశ్న నెం. 161(7)

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి,ఎమ్.ఎల్.సి

గౌరవనీయులైన వ్యవసాయ శాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాః

(అ) రాష్ట్రంలోని రైతులకు భూసార పరీక్ష సౌకర్యాలు అందుబాటులో లేవన్న విషయం వాస్తవమేనా ః

(ఆ) అయితే, ఈ విషయంలో తీసుకుంటున్న చర్యలేమిటి ?

గౌరవనీయులైన వ్యవసాయశాఖా మంత్రి గారు (శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి )

(అ) లేదండీ.

(ఆ) అయినప్పటికీ, ఈ క్రింది చర్యలను తీసుకోవడమయిందిః

(1) రాబోయే నాలుగు సంవత్సరాలలో రైతులందరి భూసార వివరాలకు సంబంధించిన అంశాలను పూర్తి చేయవలసిందిగా జాతీయ భూసార సర్వే బ్యూరోకు అప్పగించడమయింది.

(2) 12 భూసార పరీక్షా ప్రయోగశాలలు రాష్ట్రంలో పని చేస్తున్నాయి. 2014, జూన్ నుండి ఇప్పటి వరకు 82,611 నమూనాలను విశ్లేషించడమయింది.

(3) రాష్ట్రంలోని ప్రతి రైతుకు ప్రభుత్వం ఉద్దేశించిన భూసార నాణ్యతా కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతాంగం ఇబ్బంది పడుతున్న విషయం మనం గమనించాము. ఖరీఫ్ సీజన్‌లో పంటలన్నీ నష్టపోయాయి. మొదటి నుండి రైతుల్ని చైతన్యపర్చడానికి వారికి సరైన అవగాహన కల్పించడానికి ఇటువంటి పంటలు పండించండి అని చెబుతూ వస్తున్నాం. భూసార పరీక్షలు నిర్వహించకుండా అక్కడ ఏ పంట పండిస్తే లాభసాటిగా ఉంటుందనే విషయం గురించి రైతులకు అవగాహన లేదు. ఇప్పటివరకు ప్రభుత్వ పరంగా ఉన్న పరీక్షా కేంద్రాలలో రైతులు మట్టిని తీసుకుని పోతే పరీక్షలు చేస్తున్నారు. అలా ఉంటే ఏ రైతులు పరీక్షా కేంద్రాలకు తీసుకుపోతారు? అలా జరగకుండా ప్రభుత్వ పరంగా ప్రతీ గ్రామ గ్రామాన మన వ్యవసాయ విస్తీర్ణ అధికారుల ద్వారా భూమి పరీక్ష నిర్వహించేటటువంటి అవకాశముందా అని అడుగుతున్నాను.

రెండవది, మన రాష్ట్రంలో 12 భూసార పరీక్షా ప్రయోగశాలలు పని చేస్తున్నాయని మంత్రి గారు చెప్పారు. నేను ఒక రైతుని, ఎమ్.ఎల్.సిని. ఇప్పటి వరకూ ఆ భూసార ప్రయోగశాలలు

ఎక్కడున్నాయో కూడా తెలియదు. కనీసం మాకైనా ఆ 12 భూసార ప్రయోగశాలలు ఎక్కడున్నాయో వివరాలు ఇస్తే మాకు సంతృప్తి కరంగా ఉంటుంది. ఈ రెండిటికీ సమాధానం ఇవ్వవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి : అధ్యక్షా, గౌరవ సభ్యులు సుధాకర్ రెడ్డి గారు విద్యావంతులు, ఉపాధ్యాయులుగా కూడా చేశారు. ఇప్పుడు ఎమ్.ఎల్.సి అయ్యారు, రైతు కూడా. ఏ కోణంలో చూసినా వారికి చాలా అనుభవం ఉంది. వారు అడిగింది చాలా న్యాయమైన ప్రశ్న. ఎందుకంటే.. మనిషికి రోగం వచ్చినప్పుడు రోగ నిర్ధారణ కాకుండా మందులు వాడితే ఎలా తగ్గదో, ఇక్కడ కూడా భూసార పరీక్షలు చేయకుండా రైతు ఇష్టం వచ్చిన ఎరువులు వాడితే కూడా పెట్టుబడి పెరిగి నష్టపోయే పరిస్థితి వస్తుంది కాబట్టి వారు చెప్పిన విషయం గురించి ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచన చేస్తుంది. ఈ సంవత్సరం మేము జాతీయ భూసార సర్వే బ్యూరోకు ఈ కార్యక్రమాన్ని అప్పగించాము. ఈ 12 భూసార ప్రయోగశాలలు ఎక్కడున్నాయో వివరాలు గౌరవసభ్యులకు అందజేస్తాము. దానితో పాటు ఈ సంస్థకు మొత్తం 55,56,000 హోల్డింగ్స్ ఉన్నాయి. ప్రతీ సర్వే నెంబర్‌ని కూడా సర్వే చేయించి పూర్తి స్థాయిలో భూసార పరీక్షలు నిర్వహిస్తాము. ఈ సంస్థకు ప్రయోగాత్మకంగా ముందుగా మెదక్ జిల్లా గజ్వేల్, ఆదిలాబాదు జిల్లా ఇంద్రవెల్లి, మెహబూబ్‌నగర్ జిల్లా తిమ్మాజీపేట మండలాలను ముందుగా అప్పగించాము. ముందుగా ఒకప్రాంతం పూర్తయిన తరువాత వాళ్ల ఫలితాలు ఎలా ఉన్నాయనే విషయాన్ని బేరీజు వేసుకుని మిగతా ప్రాంతాలు కూడా అప్పగిస్తాము. తప్పని సరిగా ఒక్కో సర్వే నెంబరును పరీక్ష చేస్తాము. పెట్టుబడి ఎక్కువగా పెట్టడం వల్ల రైతు నష్టపోతున్నాడు. భూసార పరీక్ష లేక ఎరువులు ఏ ఎరువులు వాడాలో తెలియకపోవడం వల్ల ఎక్కువగా నష్టపోతున్నారు. ఇప్పుడు మైక్రో టెస్టింగ్, మాక్రో టెస్టింగ్ లేదు. ఈ రెండు టెస్ట్‌లు చేస్తూ, దీనిని త్వరిత గతిన పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో బడ్జెట్‌లో రెండు మొబైల్ ల్యాబ్స్‌ను, 16 కొత్త ల్యాబ్స్‌ని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించాము. దాదాపు నాలుగు సంవత్సరాలలో దీనిని అమలులోకి తేవాలనుకుంటున్నాము. శాంపిల్ పరీక్ష వచ్చిన తరువాత ప్రతి సర్వేకు సంబంధించి మనిషికి హెల్త్‌కార్డు ఉన్న విధంగానే సాయిల్ హెల్త్‌కార్డు ద్వారా SMS మెసెజ్‌ద్వారా మీ భూమిలో ఈ లోపం ఉంది అని ప్రతి రైతుకి అందజేస్తాము. నూటికి నూరు శాతం సుధాకర్ రెడ్డిగారు చెప్పిన దానితో ఏకీభవిస్తున్నాను. రోగనిర్ధారణ ఎంతముఖ్యమో భూసార పరీక్ష కూడా అంతేముఖ్యం. పెట్టుబడి తగ్గించి, దిగుబడే పెరిగే విధంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళతాము.

శ్రీ పొంగులేటి సుధాకర రెడ్డి : అధ్యక్షా, రిలేటెడ్ సబ్జెక్టు కాబట్టి మీద్వారా మంత్రిగారిని కోరేది Central Fertilizes Act ప్రకారం.. మిక్సింగ్ ప్లాంట్లని, ఎరువుల కర్మాగారాన్ని ఏర్పరుచుకునే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో అది మా ప్రభుత్వం లోనే కావచ్చు, ఒక మహానుభావుడు కడప జిల్లాకు సంబంధించి కీసరలో ప్లాంటు పెట్టి ఆయన ప్లాంటు Existing అయిన తర్వాత ఏ ప్లాంటు రాకూడదని ఒక అధికారి ద్వారా ఒత్తిడి తెప్పించి మెమో ఇప్పించాడు. ఇది ఒక కుట్రపూరితంగా జరిగింది. భూసార పరీక్షలతోపాటు Central Fertilize Act ప్రకారం మిక్సింగ్ ప్లాంట్ల ఆవశ్యకత ఉంది. హైకోర్టు కూడా డిమాండ్ అండ్ సప్లైలను బట్టి ప్రభుత్వాన్ని నిర్ణయం తీసుకోమని తీర్పునిచ్చింది. ఆ ప్లాంట్లు కట్టుకోవడానికి Fertilize Act ప్రకారం అనుమతి రావాలి. కోట్లాది రూపాయల ఋణం తీసుకుని ప్లాంట్లు కట్టారు. తెలంగాణా ప్రాంతంలో నాలుగైదు ప్లాంట్లు ఉన్నాయి. దీనిమీద పెద్ద ఎత్తున కుట్రపూరిత వాతావరణంలో bhind the screen ఒక లాబీ పనిచేసి నిరుద్యోగుల పొట్టకొట్టారు. మా కడప జిల్లా సోదరుడు ఇప్పటికీ చక్రం తిప్పుతున్నాడు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ పర్మిషన్ వచ్చింది కాబట్టి మా డీలర్స్‌కి న్యాయం చేయాలని జబర్దస్తీగా బుల్డోజ్ చేస్తూ మన రైతులకు సప్లై చేస్తూ ఓపెన్‌గా మన ప్రాంతానికి రావాల్సిన హక్కుల్ని కుళిస్తూ, బ్రహ్మాండంగా లూటీ చేసే కార్యక్రమం జరుగుతోంది. మీరు దాని మీద దృష్టి పెట్టండి. మిక్సింగ్ ప్లాంట్‌ల విషయంలో మీ యొక్క ఆలోచన ఏమిటి, మీరు ఏ చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయండి. దయచేసి పాత మెమో ఉటంకించవద్దు. అది Managed Memo. నేను ఆన్ రికార్డ్‌గా చెబుతున్నాను. ఇది చాలా అన్యాయం. నిరుద్యోగుల పొట్టకొట్టకుండా వాళ్లను ప్రోత్సహించండి. ఇది రైతులకు మంచిదని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

శ్రీ పూల రవీందర్ : అధ్యక్షా, కేవలం పత్తి, మొక్కజొన్న, వరి ఈ మూడు పంటలమీదనే రైతులు ఎక్కువగా ఆధారపడి ఉన్నారు. వాళ్లల్లో అవగాహన కల్పించి గతంలో ఇరవైముప్పై సంవత్సరాల క్రితం ఏ విధంగా అయితే అన్ని రకాల పంటలు ఉండేవో అటువంటి కమర్షియల్ క్రాప్స్‌ను కూడా పండించే విధంగా వారిని ప్రోత్సహించవలసిన అవసరం ఉందని మీద్వారా మంత్రిగారికి తెలియజేస్తున్నాను.

శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి : అధ్యక్షా, గౌరవసభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్ గారు మిక్స్‌డ్ ప్లాంట్ల గురించి అడిగారు. గతంలో సమైక్య రాష్ట్రంలో కడపలో రవీంద్రనాధ్ రెడ్డి అనే వ్యక్తి చేసిన పొరపాటు వలన ఆయన మీద యాక్షన్ కూడా తీసుకోవడం జరిగింది. నేను

మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత పత్రికలలో మిక్సింగ్ ప్లాంట్ల వాళ్లు చేసే పనిని గురించి రెండు, మూడు ఆర్టికల్స్‌లో చదివాను. రైతుకు ఏది అవసరమో అది మిక్స్ చేయకుండా నల్లమట్టిని మిక్స్ చేస్తున్నారు. అటువంటి కార్యక్రమాలు జరుగుతాయనే ఉద్దేశ్యంతో దానివల్ల రైతు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి మట్టి తీసుకుపోయి పొలాలలో పోసుకుంటే నష్టపోయే ప్రమాదముంది కాబట్టి దానిమీద ప్రభుత్వం ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఈ విషయం గురించి ముఖ్యమంత్రిగారితో మాట్లాడిన తరువాత నిర్ణయం తీసుకుంటాము. గౌరవ సభ్యులు రవీంద్ర గారు అడిగినట్లు కమర్షియల్ క్రాప్స్ కూడా పెద్దగా ఆదాయం వచ్చేవి కాకపోయినా వాటి గురించి కూడా తప్పనిసరిగా వాటిని కూడా ప్రోత్సహిద్దాం. సుధాకర్ రెడ్డి గారు అడిగిన మొదటి ప్రశ్నకు జాతీయ భూసార సర్వే బ్యూరో అనే సంస్థ మట్టిని 18 రకాలుగా పరీక్షలు చేస్తారు. ఈ పరీక్షలు పూర్తి స్థాయిలో చేసిన తర్వాత మాత్రమే రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు ఇస్తారు. కాబట్టి దీనిని మైక్రో లెవల్ నుండి మాక్రో లెవల్ వరకు తీసుకువెళ్లాలి. మాక్రో లెవల్ అంటే పొటాషియం, భాస్వరం, నత్రజని లెవల్స్ చెక్ చేయడం, మైక్రో లెవల్స్ అంటే జింక్, కాపర్, మెగ్నీషియం, ఇనుమును చెక్ చేస్తారు. కాబట్టి రెండిటినీ దృష్టిలో పెట్టుకుని పూర్తిస్థాయిలో పరీక్షలు జరిపి రైతులను ఆదుకుంటాము.

**ఆటోరిక్షాలపై రోడ్డు మరియు సేవాపన్ను మాఫీ**

ప్రశ్న నెం. 45(30)

సర్వశ్రీ డి.శ్రీనివాస్,ఎం.రంగారెడ్డి, ఫరూఖ్ హుస్సేన్, ఎం.ఎల్.సిలు.,

గౌరవనీయులైన రవాణా శాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) ఆటోరిక్షాలపై రవాదారి పన్ను / సేవా పన్నును మాఫీ చేయాలని ప్రతిపాదించడం జరిగిందా:

(ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి ః ఈ విషయంలో తీసుకుంటున్న చర్యలేమిటిః

గౌరవనీయులైన రవాణా శాఖామంత్రిగారు (శ్రీ పట్నం మహేంద్ర రెడ్డి.) ః

(అ) అవునండీ. ఎం.వి రహదారి పన్నును మాత్రమే మినహాయించడానికి ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

(ఆ) ఎం.వి పన్ను నుండి మినహాయింపు పొందే వాహన కేటగిరీలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. మొత్తం మీద 4,5,6,7 మంది కూర్చొనే సామర్థ్యం గల మూడు చక్రాల ప్యాసింజర్ ఆటోలు

2. 3000 కేజీల జివిడబ్ల్యు వరకు సామర్థ్యం గల 3 చక్రాల సరకు రవాణా వాహనాలు

పై కేటగిరీలకు చెందిన దాదాపు 3.5 లక్షల మంది కంటే ఎక్కువ మంది వాహన యజమానులు ప్రయోజనం పొందారు. ఆ ప్రకారంగా, 1342006 తేదీ రవాణా, రోడ్లు, భవనాలు (రవాణా. ఐ) శాఖ, జి.ఓ.ఎం.ఎస్.నెం. 68 ని సవరిస్తూ ఒక ప్రకటన జారీ చేయడమయింది.

శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావుః (స్థానిక సంస్థలు) అధ్యక్షా, వాస్తవంగా తెలంగాణాలో ఎన్ని ఆటోలు ఉన్నాయి? క్వార్టర్లీ ట్యాక్స్ మినహాయింపును ఇవ్వడం వల్ల ప్రభుత్వం మీద ఎంత భారం పడింది? రాబోయే రోజులలో ఈ క్వార్టర్లీ ట్యాక్స్ తీసేసి, లైఫ్ ట్యాక్స్ ఇంపోజ్ చేయడానికి ఏమైనా ఆలోచన చేస్తున్నారా? లైఫ్ ట్యాక్స్ వల్ల ఎంత ఆదాయం వస్తుందనే గురించి మంత్రిగారు సమాధానం చెప్పాలని కోరుతున్నాను.

అదే విధంగా ఎన్నికల సమయంలో చెప్పినట్లు ఆటో, రిక్షా డ్రైవర్లందరికీ ప్రమాద భీమా, ఆరోగ్య భీమా ఎప్పటినుండి మొదలు పెడతారు? ఈరోజు హైదరాబాదులో దాదాపు లక్షా ఇరవై వేల ఆటోలు నడుపుతున్నారు. చాలా ఆటోలకు మీటర్స్ లేకుండా ఉండి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. మధ్య తరగతి వాళ్లు ఆటోలలో ఎక్కువగా తిరుగుతుంటారు. 70శాతం ఆటోలకు మీటర్లు లేకుండా ఈరోజు తిరుగుతున్నాయి. దానిమీద మీరు ఏ చర్యలు తీసుకుంటున్నారు, మీటర్ల విషయం చూడడానికి ఏదైనా యంత్రాంగం ప్రభుత్వం దగ్గర ఉందా?

పెనాల్టీ విషయానికి వస్తే.. నాలుగు చక్రాల వాహనాలకు, మూడు చక్రాల వాహనాలకు ఒకే రకమైన పెనాల్టీ అని అంటున్నారు. పెనాల్టీ మినహాయింపు కేవలం ప్యాసింజర్ ఆటోలకు అని అంటున్నారు. పెనాల్టీ మినహాయింపు అనేది గూడ్స్ ఆటోలకు వర్తిస్తుందా లేదా అని అడుగుతున్నాను.

శ్రీ కపిలవాయి దిలీప్ కుమార్ ః (పట్టభద్రుల నియోజకవర్గం) అధ్యక్షా, తెలంగాణ ప్రాంతంలో చాలా చోట్ల ఆటోలు కొనేటప్పుడు వాళ్లు వద్ద అప్పుతీసుకుని కొనుక్కుంటున్నారు. ప్రైవేటు ఫైనాన్స్ వాళ్లు విపరీతమైన వడ్డీలు వసూలు చేస్తున్నారు. వీరంతా unorganized sector లో ఉన్నారు. మిత్రులు చెప్పినట్లు.. వీళ్లకు హెల్త్ కార్డ్స్ లేవు. వాళ్లకు ఇన్సూరెన్స్ ఇచ్చే ప్రతిపాదన ఏదైనా ఉందా?

ఎందుకంటే.. వరంగల్ జిల్లాలో దాదాపు 40,000 ఆటోలున్నాయి. ఆటోలు నడిపేవాళ్లలో చాలా మంది గ్రాడ్యుయేట్స్, పోస్ట్‌గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. ఆటోయూనియన్ నాయకులతో మాట్లాడి వాళ్లకు ఇన్సూరెన్స్ ఏర్పాట్లు చేస్తే వాళ్లకు గొప్ప రిలీఫ్ వస్తుంది. ఆటోయూనియన్స్ కూడా తెలంగాణా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. కాబట్టి వాళ్లకు ఈ సహాయం చేయమని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

మరో విషయం ఏమిటంటే.. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ట్యాక్సీ డ్రైవర్లు డైలీ వెళ్లి ట్యాక్స్ పేమెంట్ చేసుకోవాలి. వాళ్లు ఇంటికి పోయే సరికి కనీసం రెండు,మూడు వందలు కూడా మిగలడం లేదు. ఆ సంఘాలను కూడా పిలిపించుకుని ఆ సమస్యను పరిష్కరించి వారికి సహాయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

12.20 ప. శ్రీ పట్నం మహేందర్ రెడ్డి: (స్థానిక సంస్థలు) తెలంగాణ రాష్ట్రంలో మొత్తం ఆటోలు – 3.50లక్షలు, వాటి బకాయిల మాఫీ రూ.22.50కోట్లు, ఈ ఏడాది కొత్త ట్యాక్స్‌ల మాఫీ రూ.31.40కోట్లు, తెలంగాణాలోని పాసింజర్ ఆటోలు – 2.72లక్షలు, వీటికి ట్యాక్స్ బకాయిల మాఫీ మొత్తం రూ.10.50కోట్లు, ఈ ఏడాది కొత్తగా కొనుగోలు చేసి వాటికి ట్యాక్స్ మాఫీ రూ.13.41కోట్లు. తెలంగాణాలో ఆటో గూడ్స్ వెహికిల్స్ 78వేలున్నాయి. వీటి ట్యాక్స్ పాత బకాయిల మాఫీ రూ.12కోట్లు చేయడం జరిగింది. కొత్తగా కొనుగోలు చేసే వాహనాల మాఫీకి రూ.18కోట్లు అవుతోంది. డ్రైవర్స్ ఇన్సూరెన్స్ గురించి సభ్యులు అడిగారు, ఆ విషయం మీద ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. మధ్యతరగతి కుటుంబాలు, మైనారిటీలు చాలా మంది ఆటోల మీద ఆధారపడి ఉన్నారు కాబట్టి ముఖ్యమంత్రి గారు పెద్ద మనసుతో ఈ ట్యాక్స్ మాఫీపై నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో చాలా మంది పేద వారికి ప్రయోజనం చేకూరుతుంది.

శ్రీ యం. యస్. ప్రభాకర్ రావు: సార్, మంత్రి గారు ఒక ప్రశ్నకే సమాధానం చెప్పారు, ఇంకొక దానికి సమాధానం చెప్పలేదు. ఆటోల మీద లైఫ్ ట్యాక్స్ విధించే ప్రతిపాదన ఏదైనా ప్రభుత్వం దగ్గర ఉందా? అదే విధంగా ఆటో డ్రైవింగ్ లైసెన్స్ కోసం మినిమమ్ క్వాలిఫికేషన్ ఏమైనా పెడుతున్నారా? స్పెసిఫిక్‌గా ఆన్సర్ చేయాలని కోరుతున్నాను. క్వార్టర్లీ ట్యాక్స్ నయం,

రూ.120, రూ.130 లు ఉంటుంది, భరించవచ్చు. ఒకేసారి లైఫ్ ట్యాక్స్ కట్టమంటే చాలా భారం అవుతుంది.

శ్రీ పట్నం మహేందర్ రెడ్డి: కేవలం ట్యాక్స్ మాత్రమే ఉంది. లైఫ్ ట్యాక్స్ ఇప్పుడు లేదు.

శ్రీ సభావత్ రాములు నాయక్: అధ్యక్షా, ఆటోలకు ట్యాక్స్ మాఫీ చేసిన ప్రభుత్వం ఇది. వీళ్లంతా అసంఘటిత కార్మికులు. నేను లేబర్ డిపార్టుమెంటులో పని చేశాను. ట్రేడ్ యూనియన్ నాయకునిగా కూడా పని చేశాను కాబట్టి ఈ విషయాలు తెలుసు. కన్‌స్ట్రక్షన్ బోర్డు ఒకటి ఉంటుంది, బిల్డింగు నిర్మాణాలు చేసే వాళ్ల దగ్గర ఒక శాతం సెస్ వసూలు చేస్తారు. అదే మాదిరిగా ఒక ట్రాన్స్‌పోర్టేషన్ బోర్డు ఉంటే బాగుంటుంది. ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చారు, కార్మికులకు ఇయస్ఐ కార్డులు ఇస్తున్నారు. ఈ ఆటో కార్మికులను దారిద్ర్య రేఖకి దిగువున ఉన్న వారిగా పరిగణించాలి. వాళ్ల వెల్ఫేర్ గురించి ఆలోచించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పట్నం మహేందర్ రెడ్డి: అవును, వాళ్లకి ఇవన్నీ చాలా అవసరం, దీన్ని తప్పకుండా ఆలోచించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.

మిస్టర్ ఛైర్మన్: సమయాభావం వల్ల మిగతా ప్రశ్నలను వాయిదా వేయడం జరుగుతోంది.

## సభా కార్యక్రమము

## వాయిదా తీర్మానం అనుమతి గురించి

శ్రీ డి. శ్రీనివాస్ గారు మరియు ఇతరులు ఇచ్చిన వాయిదా తీర్మానం – పోలవరం జాతీయ ప్రాజెక్టు ప్రస్తుత డిజైన్‌ని మార్పు చేసి ముంపు ప్రాంతాలను తగ్గించే విధంగా ప్రాజెక్టు నిర్మించే విషయంలో ప్రభుత్వం తీసుకోబోయే చర్యలపై చర్చించాలంటూ ఇచ్చిన తీర్మానాన్ని తిరస్కరిస్తూ ఇంకొక ఫార్మ్‌లో వస్తే దాని గురించి చర్చిద్దామని రిక్వెస్ట్ చేస్తున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైన విషయం. లక్షలాది మంది గిరిజనులు, గిరిజనేతరులు అక్కడ ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత డిజైన్‌తో ప్రాజెక్టు కడితే భద్రాచలంలోని శ్రీరామచంద్రుని గుడికి ఇబ్బంది వస్తుందని నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. డిజైన్ మార్పుకి సంబంధించి రెండు సభలూ ఏకగ్రీవంగా తీర్మానం చేయాలని కోరుతున్నాం. ముఖ్యమంత్రి గారు గతంలో ఇక్కడ ఎన్నో తీర్మానాలు చేశారు. రొటీన్‌గా తిరస్కరించే కార్యక్రమం కాకుండా దయచేసి చర్చకి అనుమతించండి. ఇది కేవలం ఖమ్మం జిల్లాకే సంబంధించింది గాకుండా తెలంగాణాలోని గిరిజన బిడ్డల ఆవేదన అరణ్యరోదనగా ఉంది. ఈ పెద్దల సభ దాన్ని పట్టించుకోవాలి. మీరు ఎలా చేస్తే చర్చించి తీర్మానం చేద్దాం.

మిస్టర్ ఛైర్మన్: ఇప్పుడు వీలు కాదు. ఈరోజు సమయాన్ని దృష్టిలో పెట్టుకుని దయచేసి అర్థం చేసుకోండి. వేరే ఫార్మ్‌లో వస్తే చర్చిద్దాం .

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డిః అధ్యక్షా, భూముల కబ్జాలకు సంబంధించిన అంశంపై నిన్న Entire House ఏకాభిప్రాయానికి వచ్చింది. డెప్యూటీ సియం/రెవెన్యూ మంత్రిగారు కూడా నిన్న ఒప్పుకున్నారు. ముఖ్యమంత్రి గారితో చెప్పి ఎనౌన్స్ చేయిస్తామని మీరు కూడా చెప్పారు. ఇది హౌస్ గౌరవంతో ముడిపడి ఉంది. చాలా ముఖ్యమైంది, ప్రభుత్వానికి ఆదాయాన్నిచ్చే సబ్జెక్ట్. ఫిల్మ్ నగర్ సొసైటీ, జూబ్లీ హిల్స్ సొసైటీలలో, అదే విధంగా జిల్లాలలో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. రేపటి నుండి మధ్యలో ఐదు రోజుల గ్యాప్ ఉంది. సమావేశాలుండవు. తర్వాత 21, 22 తేదీలలో మాత్రమే హౌస్ ఉంటుంది. కాబట్టి ముఖ్యమంత్రి గారిని పిలిపించి ఎనౌన్స్ చేయిస్తే బాగుంటుంది. ముఖ్యమంత్రిగారు ఇప్పటికైనా సభకి వస్తారని అనుకున్నాం, సభ ప్రారంభమై 8 రోజులైంది. వారు వస్తే సభ నిండుగా ఉంటుంది. ఇది పెద్దల సభ, ఆ గౌరవం ఉండాలి.

శ్రీ డి. శ్రీనివాస్ః (శాసనసభ నియోజకవర్గం) అధ్యక్షా, సుధాకర్ రెడ్డిగారు సుదీర్ఘంగా చెప్పారు. సాయంత్రం లోపల ముఖ్యమంత్రి గారితో చర్చించి ఎనౌన్స్ చేస్తామని రెవెన్యూ మంత్రిగారు నిన్న చెప్పారు. ఈరోజు సభ ముగిసే లోపల ఖచ్చితమైన ప్రకటన రావాలి. ఎందుకంటే ఐదు రోజుల పాటు గ్యాప్ వచ్చింది. ఇంత ముఖ్యమైన విషయం మీద హౌస్ ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత కూడా రిజల్ట్ లేకపోతే బాగుండదు. సాయంత్రం లోపల ఎనౌన్స్‌మెంటు వచ్చేలా చూడండి.

శ్రీ అరికెల నర్సారెడ్డిః సార్, ఈ సభకి గౌరవం వచ్చేలా కొంచెం మీరు ప్రయత్నం చేయాలి. మన సభా నాయకుడెవరో, ఆమేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందో లేదో నాకు తెలియదు. సభా నాయకుడు లేక, ముఖ్యమంత్రిగారు సభకి రాకుండా ఈ సభకి ఏవిధంగా గౌరవం లభిస్తుంది? ఈ సభ గౌరవం, మర్యాద, హుందాతనం నిలబడేలా చూడాలి. పెద్దల సభంటే గౌరవమని ముఖ్యమంత్రిగారు గతంలో చెప్పారు. పెద్దల సభ గౌరవం తగ్గుతోంది, ఇది కరెక్టు కాదు. సభా నాయకుడెవరో తొందరగా నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యమంత్రి గారు రోజూ కనీసం ఒకటి, రెండు గంటలైనా ఈ సభలో కూర్చొని పోతే సభ గౌరవం పెరుగుతుంది. నిన్న బడ్జెట్ రిప్లై సమయంలో ముఖ్యమంత్రిగారు వస్తారని ఆశించాం. నిన్న ముఖ్యమంత్రి గారు వచ్చి ఉంటే ప్రతిపక్షాలు అడిగిన విషయాలపై సరైన జవాబు వచ్చేది. మంచి రిప్లై వచ్చేదని మేము భావించాం . అందుకే నిన్న మేము వాకౌట్ చేయవలసిన పరిస్థితి వచ్చింది గానీ మరొకటి కాదు. సభానాయకున్ని నియమించండి. ముఖ్యమంత్రిగారు కూడా ఈ సభకి వస్తే బాగుంటుంది.

మిస్టర్ ఛైర్మన్ః సభ్యుల మనోభావాలన్నింటినీ మంత్రుల ద్వారా ముఖ్యమంత్రిగారికి తెలియజేయడం జరిగింది. ఖచ్చితంగా మీ ఆలోచనతో మేమందరమూ ఏకీభవిస్తున్నాం .

## ప్రత్యేక ప్రస్తావన

శ్రీ కపిలవాయి దిలీప్‌కుమార్ ః అధ్యక్షా, ఒకప్పుడు హైదరాబాదు సిటీకి ఐదుసార్లు Cleanest city గా అవార్డు వచ్చింది. కానీ ఈరోజు కచ్రా సిటీ అయిపోతోంది. ఈ సమస్య ఇక్కడే గాకుండా వరంగల్ టౌన్, ఖమ్మం, ప్రతి మున్సిపల్ కార్పోరేషన్‌లో కూడా ఉంది. గార్బేజ్ విపరీతంగా pile up అవుతోంది. వాస్తవానికి ఇది ముఖ్యమంత్రిగారి సబ్జెకు. ఇక్కడ యువ మంత్రిగారున్నారు. కాబట్టి మీరే స్వయంగా ఆ మంత్రిగారిని తీసుకొని విదేశాలకు వెళ్లి చూసి రండి. గతంలో చాలా మంది ఛైర్మన్లు ఆరు దేశాలకు వెళ్లొచ్చారు. మీరు ఆరు నెలలైంది, ఒక దేశానికి కూడా పోలేదు. మీరు కెనడా, రష్యా దేశాలకు పోయి చూడండి. అక్కడ మిషన్లతో కచ్రాను సెగ్రిగేట్ చేసి కన్వర్ట్ చేస్తారు, energy pellets చేస్తున్నారు. ఎలక్ట్రిసిటీ ప్రొడ్యూస్ చేస్తున్నారు. కచ్రా పోయి ఎనర్జీ వస్తుంది. మిమ్మల్ని రిక్వెస్ట్ చేస్తున్నాను. మీ అస్యూరెన్స్ కూడా కావాలి. మీ ఛేంబర్‌లోకి అధికారులను పిలిపించి, కెటిఆర్ గారినో లేక మరొక మంత్రినో పిలిపించుకుని, ఎందుకంటే ముఖ్యమంత్రి గారు రాష్ట్రపునర్నిర్మాణంలో బిజీగా ఉన్నారు కాబట్టి, మీరే స్వయంగా పర్యటించి రండి. గతంలో స్పీకర్ గారు నల్గొండ జిల్లాకి వచ్చి స్వయంగా ప్రజా సమస్యలను చూసి పోయారు. ఆ సాంప్రదాయం ఉంది. స్పీకర్లు ఈ మధ్య pro-active అయిపోయి జిల్లాలలో పర్యటనలు చేసి రకరకాల ప్రజా సమస్యలు విన్నారు. తమరు కూడా తెలంగాణా సమస్యల పట్ల అపారమైన అనుభవం ఉన్న వారు కాబట్టి అలాంటి ప్రోగ్రామ్స్ టేకప్ చేసి, డైరెక్టుగా మీ ఛేంబర్‌లోకి అధికారులను పిలిపించుకుని మాట్లాడమని విజ్ఞప్తి చేస్తున్నాను. అదే విధంగా గవర్నమెంటుకి కూడా సూచించండి. ఆదేశాలలో వాడుతున్న మిషన్స్‌ని incinerators అంటారు. అలాంటి మిషన్స్ తెలంగాణాలో ప్రతి పట్టణంలో ఏర్పాటు చేస్తే ఈ కచ్రా దరిద్రం పోతుంది, health hazards తొలగి ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఏర్పడుతుంది.

శ్రీ కె. యాదవరెడ్డిః అధ్యక్షా, ఇందిరా లెజిస్లేటర్స్ ముచ్చువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్స్ సొసైటీ లిమిటెడ్ అనే ఒక కోఆపరేటివ్ సొసైటీని ఫార్మ్ చేసి, లెజిస్లేటర్స్ మరియు యంపీలను కూడా అందులో సభ్యులుగా చేశారు. ఎనిమిది సంవత్సరాలైంది. ఎనిమిది సంవత్సరాలకు ముందు ఒక్కొక్క సభ్యుడి నుండి రూ.10లక్షలు వసూలు చేశారు. ఎనిమిది సంవత్సరాలలో ఏమి యాక్షన్ జరిగిందో,

ఎందుకు ఇది ఆగిపోయిందో తెలియదు. ఎంతో మంది దోపిడీదారులకు వందల ఎకరాలను దారాదత్తం చేశాయి గత ప్రభుత్వాలు. సభ్యులు ఐదు వందల గజాల కోసం పెట్టుకున్న దాని గతేమైందో ఇప్పటి వరకు తెలియలేదు. ఈ డిలే కారణాలు తెలుసుకుని, ప్రభుత్వం ఈ విషయం త్వరగా resolve అయ్యేలా చూడాలి. ఇంతకు ముందు ఒక కమిటీ ఉండేది. Divided State లో ఆ కమిటీ future ఏమిటో తెలియదు, ఏ వ్యవహారాలు చేస్తున్నారో తెలియదు. ఆరోజు మేము ఇచ్చిన పది లక్షలు ఎక్కడైనా ఇన్వెస్ట్ చేసి ఉంటే ఇప్పటికి అది కోట్లు అయ్యేది. ఎనిమిది సంవత్సరాలైంది. కాబట్టి దీన్ని త్వరగా resolve చేసి ఈ సభ్యులకి 500గజాల ప్లాట్లు ఎలాట్ అయ్యేలా చూడవలసిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ టి.భానుప్రసాదరావు : (స్థానిక సంస్థలు) అధ్యక్షా, రూల్ 172 అండ్ 173 ప్రకారంగా ఒక ప్రివిలేజ్ మోషన్ మూవ్ చేయడం జరుగుతోంది. ఈరోజు ఆంధ్రజ్యోతి దినపత్రికలో బడ్జెట్‌లో అమరులకు అన్యాయమనేటటువంటి ఒక ఆర్టికల్ రావడం జరిగింది. ఆ ఆర్టికల్‌లో వాళ్ళు – తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు ఇవ్వడం, హెల్త్‌కార్డులు ఇవ్వడం, పి.ఆర్.సి ఇవ్వడం న్యాయవాదులకు రు.100 కోట్లు ఇవ్వడం, జర్నలిస్టుల సంక్షేమానికి రు.10 కోట్లు కేటాయించడం సముచితమే కానీ, ఉద్యమంలో వాళ్ళ సహచరులుగా పాల్గొన్న విద్యార్థులను, ప్రజా సంఘాలను, కుల సంఘాలను విస్మరించడం తగదు. ఎం.ఎల్.ఏలకు, ఎం.ఎల్.సిలకు జీతాలు పెంచిన ప్రభుత్వం – అనే విధంగా ఈ ఆర్టికల్ రాయడం జరిగింది. మనందరికీ తెలుసు. మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కానీ, లేకపోతే ఈ జరుగుతున్నటువంటి సెషన్‌లో కానీ ఈరోజుటి వరకు ఎం.ఎల్.ఏలకు, ఎం.ఎల్.సిలకు ఒక్క రూపాయి పెంచినట్లుగా ఆ బడ్జెట్‌లో లేదు అధ్యక్షా. అదే విధంగా ఆ విషయమై ఇంతవరకూ ఏ బిల్లు కూడా ఈ సభకు రాలేదు. అంటే ఎటువంటి పెంపుదలా లేకుండానే ఒక దినపత్రిక బాధ్యతారాహిత్యంగా ఈ విధంగా ఎం.ఎల్.ఏలు, ఎం.ఎల్.సిలకు జీతాలు పెంచుకున్నారు అనేటటువంటి ఆరోపణ ఈ ప్రభుత్వం మీద చెయ్యడం, ఇక్కడున్నటువంటి సభ్యులమీద చెయ్యడమనేటటువంటిది ఈ సభా మర్యాదకి, ఈ సభా సభ్యుల గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉంది కాబట్టి, ఏ మాత్రం నిజాలు కానటువంటి అసత్య ప్రచారాలు చేస్తూ, ఈ విధమైనటువంటి ఆర్టికల్స్‌ను ప్రచురిస్తున్నటువంటి ఈ పత్రికమీద చర్య తీసుకోవాలని ఈ సభ్యుల గౌరవాన్ని కాపాడాలని, ఈ సభ్యులను అగౌరవపరిచే విధంగాను, రకరకాల ఆరోపణలు చేస్తున్న ఈ పత్రికమీద చర్య తీసుకోవాలనీ, సభ్యులుగా మా గౌరవాన్ని కాపాడే విషయంలో మా రెస్క్యూకు రావాలనీ ఈ సభ ఇటువంటి విషయాలపట్ల చాలా కఠినంగా ఉండాలని కోరుతున్నాను.

శ్రీ కె.యాదవరెడ్డి : అధ్యక్షా, రూల్ 172 కింద మేము మిమ్మల్ని కోరుతున్నాము. మాకు అనుమతివ్వాలి. ప్రివిలేజ్ మోషన్ కింద దీనిని మూవ్ చేయదలచుకున్నాము. సభలోని సభ్యులెవరికీ దీనిపట్ల అభ్యంతరముండదు. అందరూ యునానిమస్‌గా ఉంటారు. పదిమంది సభ్యులు ఏకీభవిస్తున్నారు. తప్పకుండా ప్రివిలేజ్ మోషన్ మీరు యాక్సెప్ట్ చేయాల్సి వస్తుంది. ప్రివిలేజ్ కమిటీ లేదు కాబట్టి తప్పకుండా మీరే దానిమీద తక్షణమే డెసిషన్ తీసుకుని ప్రివిలేజ్ మోషన్ ఎలా చేయాలని కోరుతున్నాము.

శ్రీ యం. రంగారెడ్డి : అధ్యక్షా, జీతాలు పెంచినట్లు, మా ఫండ్స్ పెంచినట్లు కొన్ని పత్రికలలో వచ్చినమాట వాస్తవమా? ఏ ఆర్టికలో దానిని తెప్పించి చెప్పండి. ఇంతకుముందు కూడా కొన్ని పత్రికలలో ఏం వచ్చిందంటే ఒక ఎం.ఎల్.ఏకు జీతం రెండు లక్షల రూపాయలని వచ్చింది.

శ్రీ టి.భానుప్రసాదరావు : (మైకు లేకుండా) అధ్యక్షా పెంచుతున్నట్లుగా వచ్చిన వార్తలు వేరు. పెంచినట్లుగా వచ్చిన వార్తలు వేరు. పెంచినట్లుగా పబ్లిష్ చేయడం జరిగింది. పెంచుతున్నట్లుగా పబ్లిష్ చేస్తే అది వేరే ఇష్యూ.

శ్రీ యస్. జగదీశ్వర్ రెడ్డి : (స్థానిక సంస్థలు) అధ్యక్షా, ఇదే పేపరులో అమరులను మరచిన ప్రభుత్వమని ఇచ్చినారు. కానీ నిన్ననే బడ్జెట్‌లో అమరుల కుటుంబాలకు రు.10 లక్షల ఆర్థిక సహాయం ఇస్తున్నట్లు, బడ్జెట్‌లో ప్రవేశపెడుతున్నట్లు చదివినాము. మరి అది మరిచిపోయి పత్రిక యాజమాన్యం కానీ, ఎవరైనా లెటర్స్ రాస్తే ఈ విధమైనటువంటి ప్రచురణ చేసి ఎం.ఎల్.ఏలు, ఎం.ఎల్.సిలు, ప్రజా ప్రతినిధుల యొక్క ప్రతిష్టకు భంగం కలిగించడానికి ప్రయత్నం చేస్తే దానిపైన తప్పకుండా చర్య తీసుకోవాలి. ఇది ప్రివిలేజ్ కిందకు వస్తుంది కాబట్టి, ప్రివిలేజ్ మోషన్ ఎలా చేయాలని కోరుతున్నాము.

శ్రీ అరికెల నర్సారెడ్డి: అధ్యక్షా, మన సభకి కానీ, సభ్యులకు కానీ అమర్యాద జరిగినప్పుడు ఎవరైనా ఏమైనా చేసుకోవచ్చు అది వాళ్ళ రైట్. అయితే గతంలో కూడా రెండు, మూడు టి.వి ఛానల్స్ మీద యాక్షన్ తీసుకోమన్నాము. యాక్షన్ అంటే వాళ్ళకి ఏదో ఒక పనిష్మెంట్ ఇవ్వాలి. కానీ దానిని ఆధారంగా తీసుకుని మొత్తం ఛానల్స్‌నే మూసే పరిస్థితి తీసుకొచ్చారు. ఎందుకంటే ఇప్పుడు కూడా మీకు అటువంటి ఉద్దేశం ఉంటే, పేపర్లో వస్తూ ఉంటాయి. ఎవరి యాంగిల్‌లో వాళ్ళు రాస్తున్నారు. ప్రభుత్వం పెంచడం తప్పుకాదు.

న్యూస్ రావడం తప్పు కాదు. కానీ దానినేదో బేస్ చేసుకుని ఆ పత్రికనే మూసెయ్యాలనే ఆలోచన కానీ ఉంటే మనల్ని ప్రజలు క్షమించరు. ఎందుకంటే మనం కూడా ప్రజాస్వామ్యంలో ఉన్నాము. ప్రజాస్వామ్యంలో పత్రికలుంటాయి, ప్రతిపక్షాలుంటాయి, చెప్పేవాళ్ళుంటారు. వినేవాళ్ళుంటారు. దానికి ప్రభుత్వం ఆ విధంగా పోవాలి కానీ మనకు ఎవరో ఒకళ్ళు యాంటీగా మాట్లాడితే వాళ్ళని.......

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్ : తప్పకుండా మీరిచ్చినటువంటి ప్రివిలెజ్ మోషన్‌ను పరిశీలించి మిగతా సభ్యుల మనోభావాలని దృష్టిలో పెట్టుకుని చర్య తీసుకోవడం జరుగుతుంది.

(అంతరాయం)

శ్రీ కె. యాదవరెడ్డి : మేము పదిమంది సభ్యులం అడుగుతున్నాము సార్.

(అంతరాయం)

మిస్టర్ ఛైర్మన్ : మీరు నోటీసు ఇవ్వండి. తప్పకుండా మిగతా పత్రికలలో వచ్చిన దానిని కూడా ఎగ్జామిన్ చేసి చర్య తీసుకుంటాం.

12.40 మ.

## ప్రభుత్వ తీర్మానము

## కేంద్ర ప్రభుత్వ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గురించి

శ్రీ కె.తారక రామారావు :

కేంద్ర ప్రభుత్వం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని దేశంలోని 2500 వెనుక బడిన బ్లాకులకే పరిమితం చేస్తూ, ఆ పథకానికి మార్పులను ప్రతిపాదించింది. వీటిలో తెలంగాణ రాష్ట్రంలోని 78 మండలాలు (బ్లాకులు) మాత్రమే చేరి వున్నాయి. తెలంగాణ శాసన పరిషత్తు ప్రతిపాదిత మార్పులకు తమ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. ఎందుకంటే, మరే ఇతర పని లభ్యం కానప్పుడు, అనేక మంది గ్రామీణ పేదలకు ప్రత్యేకించి మహిళలతోపాటు సమాజంలోని బడుగు, అణగారిన నైపుణ్యం లేని వర్గాల వారికి వేతన ఉపాధిని ఈ పథకం సమకూరుస్తోంది.

ఈ సమస్య కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో మరింత తీవ్రంగా వుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బ్లాకులలోను వెనుకబడిన ప్రాంతాలు మరియు పరిమిత వనరులు ఉన్నట్లుగా గుర్తించడమైనది.

చట్టంలోని ఫలితాలను తప్పుగా అన్వయించుకోవడం ఆధారంగా కొన్ని ప్రాంతాలకే చట్టం వర్తింపును పరిమితం చేసే ఏ చర్య అయిన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. తద్వారా ఈ పథకం వల్ల లబ్ధిపొందుతున్న దళితులు, మహిళలకు నష్టం కల్గుతుంది.

అందుచేత, ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామీణ బ్లాకులలో అమలు పరచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తెలంగాణ రాష్ట్ర శాసన పరిషత్తు ఏకగ్రీవంగా తీర్మానిస్తున్నది.

శ్రీ డి.శ్రీనివాస్ : అధ్యక్షా, దానిలో ఈ పథకాన్ని ప్రారంభించినటువంటి యు.పి.ఎ. ప్రభుత్వాన్ని అభినందిస్తూ, దయచేసి ఆయొక్క పథకాన్ని as it isగా ఉంచాలని మనం కోరుతున్నామని పెట్టడానికి గౌరవ పంచాయతీ రాజ్ మంత్రి గారు ఒప్పుకున్నారు. కాబట్టి దయచేసి దానికి include చేసి తీర్మానము పెట్టండి.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, ఈ తీర్మానంలో మొదలు, మొదలుగానే గత యు.పి.ఎ. ప్రభుత్వం అని చేర్చాలి. దళితులు, మహిళలకు దగ్గర వెనుకబడిన వర్గాలతోపాటు అన్ని వర్గాల పేదలకి నష్టం కలుగుతుంది. అనేది అక్కడ చేర్చి చేస్తే బాగుంటుందని మీద్వారా గౌరవ మంత్రివర్యులకి సూచిస్తున్నాను.

శ్రీ కె.తారక రామారావు : అధ్యక్షా, వారి ప్రతిపాదనతో నేను ఏకీభవిస్తూ, సవరించిన తీర్మానాన్ని తెలియజేస్తున్నాను. "**గత యు.పి.ఎ. ప్రభుత్వం ప్రవేశపెట్టిన**" మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అలాగే పెద్దలు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు చెప్పినట్టుగా దళితులు, మహిళలకు అన్న చోట "**అన్ని వర్గాల ప్రజలకు**" నష్టం కలుగుతుందనే విషయాన్ని చేరుస్తున్నాను.

శ్రీ డి. శ్రీనివాస్ : అధ్యక్షా, గౌరవ పంచాయతీ రాజ్ మంత్రి గారు ప్రభుత్వం తరఫున ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష నాయకుడిగా I represent the whole Opposition గనుక అట్ల I second the Government's Resolution అట్ల అది యునానిమస్ అయిపోయింది.

MR. CHAIRMAN : The House is hereby unanimously adopting the Government's Resolution as amended by the Minister.

## సంతాప ప్రతిపాదన

MR. CHAIRMAN : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన పరిషత్తు మాజీ సభ్యులు శ్రీ బీరవెల్లి ధర్మారెడ్డి గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

శ్రీ బీరవెల్లి ధర్మారెడ్డి గారు 1942వ సంవత్సరంలో మంద్ర గ్రామము, నార్కెట్‌పల్లి మండలము, నల్లగొండ జిల్లాలో జన్మించారు. వీరు 1984–1985 మధ్య కాలంలో నల్లగొండ జిల్లా ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి శాసన మండలి సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. వృత్తిరీత్యా వీరు ఉపాధ్యాయులు.

72 ఏళ్లవయస్సులో 2014వ సంవత్సరము, సెప్టెంబర్ 13వ తేదీన శ్రీ బీరవెల్లి ధర్మారెడ్డి మరణించారు.

వీరి ఆత్మ శాంతి కొరకు రెండు నిమిషాలు మౌనం పాటించాల్సిందిగా కోరుతున్నాను.

(సభ రెండు నిమిషాలు మౌనం పాటించారు)

MR. CHAIRMAN: The House is adjourned to meet again at 10.00 a.m. on Friday, the 21st November, 2014.

(The House then adjourned at 12.45 p.m. to meet again at 10.00 a.m. on Friday, the 21st November, 2014.)

"Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and printed at the Assembly Press, Public Gardens, Hyderabad."